సోమవారం
19-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 357
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్వలాభాపేక్షతో రెజ్లర్లను వాడుకోవాలనుకున్నారు

బబితా ఫోగాట్, తీరథ్ రాణాపై సాక్షి మాలిక్ ఆరోపణలు

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్లు చేపట్టిన ఆందోళన నేపథ్య పరిణామాలు ప్రస్తుత, మాజీ రెజ్లర్ల మధ్య మాటల యుద్ధానికి తెరతీశాయి.

8లో

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తెలుగుతేజాలు

చిద్విలాస్ రెడ్డి

నాగభవ్యశ్రీ

న్యూఢిల్లీ: ఐఐటీలో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ) అడ్వాన్స్‌డ్‌లో తెలుగు విద్యార్థి, హైదరాబాద్ జోన్‌కు చెందిన వవిలాలా చిద్విలాస్ రెడ్డి సత్తా చాటారు. టాపర్‌గా నిలిచారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాలు ఆదివారం విడుదల కాగా మొత్తం 43వేల మందికిపైగా ఉత్తీర్ణత సాధించారు. ఐఐటీ గువహటి ఈ పరీక్షలు నిర్వహించింది. చిద్విలాస్ రెడ్డికి 360కుగాను 341 మార్కులు వచ్చాయి. ఆయన పరీక్షల్లో నంబర్ వన్‌గా నిలిచారు. అయితే నయకాంతి నాగభవ్యశ్రీ (ఐఐటీ హైదరాబాద్ జోన్) 298 మార్కులతో అమ్మాయిల్లో టాపర్‌గా నిలిచారు. టాప్ టెన్‌లో ఆరుగురు ఐఐటీ హైదరాబాద్ జోన్‌కు చెందిన విద్యార్థులు ఉన్నట్లు ఐఐటీ గువహటి ప్రకటించింది. చదిల్వాస్ రెడ్డి తర్వాత రమేశ్ సూర్య తేజ (హైదరాబాద్ జోన్) రెండో ర్యాంకు సాధించారు. ఇక వరుసగా రిషి కల్రా (రూర్కీ జోన్), రాఘవ్ గోయల్ (రూర్కీ), అడ్డగాడ వెంటక శివరామ్ (హైదరాబాద్), ప్రభావ్ ఖండేల్వాల్ (ఢిల్లీ), బిక్కిన అభినవ్ చౌదరి (హైదరాబాద్), మాలే కేడియా (ఢిల్లీ), నాగిరెడ్డి బాలాజీ రెడ్డి (హైదరాబాద్), యన్మాంతి ఫణి వెంకట మనీధర్ రెడ్డి (హైదరాబాద్) పదిలోపు ర్యాంకులు సాధించారు. ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి అత్యధిక మంది అభ్యర్థులు అర్హత సాధించగా టాప్ 500 ర్యాంకుల్లో 174 ఐఐటీ హైదరాబాద్‌కు దక్కాయి. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే జోన్ల విద్యార్థులు కూడా రాణించారు. 500లోపు 120 ర్యాంకులు ఐఐటీ ఢిల్లీ జోన్‌కు రాగా ఐఐటీ బాంబే జోన్‌కు 103 ర్యాంకులొచ్చాయి. 13 మంది విదేశీ

- టాపర్‌గా నిల్చిన చిద్విలాస్ రెడ్డి
- అమ్మాయిల్లో నాగభవ్యశ్రీ
- ఐఐటీ హైదరాబాద్‌కే అధిక ర్యాంకులు
- 43 వేల మందికిపైగా ఉత్తీర్ణులు

- మిగతా 2 లో

అసమ్మతి రాగం

- జగన్ బుజ్జగింపుల మంత్రం
- సుచరిత భర్తకు పదవి
- మచిలీపట్నం పోర్టు సీఈవోగా దయాసాగర్
- ఎంపీ టికెట్ ఆశకు ఎసరు
- పార్టీలో వర్గ విభేదాల రచ్చ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసమ్మతి నేతలను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. చాలా నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు తమకు పదవులు దక్కలేదని, అధిష్టానం సముచిత స్థానం కల్పించడం లేదంటూ అసంతృప్తితో ఉన్నారు. దీంతో నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు రచ్చకెక్కి ఆధిపత్య పోరు తార స్థాయికి చేరింది. దీనిని దృష్టిలో ఉంచుకుని జగన్ ప్రభుత్వానికి నాలుగేళ్లు పూర్తవడంతో ఇక ఎన్నికలపైనే దృష్టి పెట్టింది. ముందు పార్టీలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమిస్తూ చిన్నపాటి పదవులతో కంటి తుడుపు చర్యలను సీఎం చేపట్టారు. తొలి విడత మంత్రి పదవులు పూర్తి చేసుకుని, రెండో విడత బెర్తులు దక్కించుకోలేని వారంతా జగన్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అప్పట్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన హోం శాఖ మాజీ మంత్రి మేకతోటి సుచరితకు మళ్లీ మంత్రి పదవిలో స్థానం లభించనందున తుదకు రాజీనామాకు సైతం సిద్ధమయ్యారు. వైసీపీ పెద్దలు వెళ్లి ఆమెతో మాట్లాడినా ససేమిరా అని వెనక్కి తగ్గలేదు. తీరా జగన్ తాడేపల్లిలోని తన నివాసానికి పిలిపించుకుని ఆమెకు సర్ది చెప్పారు. ఆ సమయంలో ఐదుగురు ఎస్సీ మంత్రుల్లో నలుగురిని ఉంచి, కేవలం సుచరిత ఒక్కరినే పదవి నుంచి తప్పించడంపై తీవ్ర కలత చెందారు. ఇదే విషయాన్ని ఆమె జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అదే సమయంలో ఆమె భర్త ఐఆర్ఎస్ హోదాలో చాలా కాలంపాటు ఇతర రాష్ట్రాల్లో పని చేస్తూ, ఏపీకి బదిలీపై వచ్చారు. రాబోయే ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎంపీగా పోటీకి దిగాలనే లక్ష్యంతో ఆయన ఉన్నారు. దీనిని గమనించిన కొందరు సొంత పార్టీ ప్రజాప్రతినిధులే... కేంద్రంలోని బీజేపీ నేతలతో సంప్రదింపులు చేపట్టి ఉన్న పళంగా ఏపీ నుంచి బదిలీ చేయించినట్లు సుచరిత వర్గీయులు చెబుతున్నారు. ఇదే అంశాన్ని జగన్ దృష్టికి మేకతోటి సుచరిత తీసుకువెళ్లినా ఆయన స్పందించ లేదని తెలిసింది. దీనికితోడు సుచరితను మంత్రి పదవి నుంచి తప్పించి, అదే జిల్లా నుంచి విడదల రజనీకి ఇవ్వడంతో ఆమె వర్గీయులు మరింత అసంతృప్తికి గురయ్యారు. ఆ తర్వాత పార్టీ పదవుల్లో భాగంగా సుచరితకు గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్ష పదవిని కేటాయించినా, దానిని స్వల్ప కాలంపాటే ఆమె బాధ్యతలు నిర్వహించి రాజీనామా చేశారు. అప్పటి నుంచి తన సొంత నియోజకవర్గానికే పరిమితమయ్యారు. కొంతకాలం నుంచి మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో సుచరిత నిమగ్నమయ్యారు.

బాపట్ల ఎంపీ టికెట్‌పై దయాసాగర్ ఆశలు

కొన్ని నెలల క్రితం దయాసాగర్ ఐఆర్ఎస్‌కు స్వచ్ఛంద పదవీ విరమణ చేసి గుంటూరు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక అంశాలపై చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ తరపున బాపట్ల ఎంపీగా పోటీకి ఆయన ఆసక్తి చూపుతున్నారు. ఇదే అంశాన్ని జగన్ దృష్టికి చాలా సార్లు సుచరిత తీసుకెళ్లినా ఆయన గట్టి హామీ ఇవ్వలేదని తెలిసింది. దీంతో సుచరిత మరింత కలత చెందినట్లు ప్రచారం వచ్చింది. ఇదే సమయంలో టీడీపీ నుంచి సుచరితకు, దయాసాగర్‌కు ఆహ్వానం లభించినట్లు తెలిసింది. దయాసాగర్‌కు బాపట్ల ఎంపీ, సుచరితకు ఉన్న స్థానం నుంచే ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేలా ఆఫర్ వచ్చినట్లు ప్రచారం ఉంది. దీంతో జగన్ ప్రభుత్వం అప్రమత్తమై సుచరితను బుజ్జగించాలనే సాకుతో దయాసాగర్‌కు ఉన్న పళంగా మచిలీపట్నం పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవోగా) నియమిస్తూ ఉత్తర్వులు జారీజేసింది. రెండేళ్ల పాటు ఆయన పదవిలో ఉంటారు. ఏడాదిలోగా ఎన్నికలు రానున్నాయి. దయాసాగర్ వైసీపీ నుంచి ఎంపీ టికెట్ ఆశిస్తుంటే, ఈలోగా వ్యూహాత్మకంగా జగన్, మచిలీపట్నం పోర్టు సీఈవో పదవిని ఆయనకు కట్టబెట్టి కన్నీళ్లు తుడిచినంత పని చేశారని, ఇది కేవలం దయాసాగర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వకుండా కట్టడి చేయడంలో భాగమేనని సుచరిత వర్గీయులు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

నియోజకవర్గాల్లో గ్రూపుల బెడద

చాలా నియోజకవర్గాల్లో వైసీపీకి అసమ్మతి సెగ, గ్రూపుల బెడద నెలకొనడం సీఎం జగన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా వైసీపీలోని ఒక వర్గం భేటీలు నిర్వహించింది. శృంగవరపు కోటలో వైసీపీ నేతల మధ్య గ్రూపు తగాదాలు తార స్థాయికి చేరాయి. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి సైతం ప్రాంతీయ ఇన్ ఛార్జ్ పదవి తనకు వద్దంటూ అలక పాన్పు ఎక్కారు. ఆయన కూడా మంత్రి పదవి పోయినప్పటి నుంచి అసంతృప్తితో ఉన్నారు. ఏలూరుకు చెందిన మరో మాజీ మంత్రి ఆళ్ల నాని ఇదే ధోరణితో ఉన్నారు. పార్టీలో ఆయన క్రియాశీలకంగా పాల్గొనడం లేదు. ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మౌనంగా ఉన్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లాలో ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో వారిపై వైసీపీ అధిష్టానం వేటు వేసింది. ఆ ముగ్గురూ టీడీపీలోకి

- మిగతా 2 లో

విద్యుత్ చార్జీల పెంపును ప్రతిఘటించాలి

- స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ విధానాలు రద్దు చేయాలి
- వామపక్షాల సదస్సులో వక్తలు
- ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు పిలుపు

విశాలాంధ్ర–విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడాన్ని ప్రతిఘటించాలని వామపక్షాల రాష్ట్ర సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాలు లేదా సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు చేపట్టాలని, జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలతో పాటు సంతకాల సేకరణ, శాసన సభ్యులకు మెమోరాండాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల అధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు జగన్‌కు ఎందుకంత ఉబలాటమని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు మోపనని చెప్పిన జగన్ ఇప్పటి వరకు సుమారు రూ.50 వేల కోట్ల భారాలను ప్రజలపై మోపారని తెలిపారు. ఈ భారాలను ఎందుకు మోపారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గజదొంగలాగా పట్టపగలే ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. తక్కువ ధరకే విద్యుత్ దొరుకుతున్నా మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. అదానీ కంపెనీతో కుమ్మక్కయ్యారని, ట్రాన్స్‌మిషన్ల మరమ్మతులు చేసే షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కు స్మార్ట్ మీటర్ల టెండర్ అప్పగించారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.17 వేల కోట్ల భారాలు ప్రజలపై మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చండీఘర్, రాజస్థాన్ రాష్ట్రాల్లో రూ.10 వేల లోపు ఉన్న స్మార్ట్ మీటర్‌ను రూ.37 వేలతో ఎందుకు కొనుగోలు చేస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. మిగులు విద్యుత్ ఉండాల్సిన రాష్ట్రంలో కరెంట్ కోతలు ఉన్నాయని విమర్శించారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం వెనకడుగు వేసేలా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సీఎం జగన్ సాగిలాపడి ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాలే అమలు చేయని విద్యుత్ సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో ప్రపంచ బ్యాంకు షరతులకు చంద్రబాబు నాయుడు తలొగ్గి విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తే, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం షరతులకు జగన్ తలొగ్గారని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని

- మిగతా 2 లో

పీఎస్‌యూల్లో కొలువులు మాయం

పదేళ్లలో 2.7 లక్షల ఉద్యోగాల కోత

- ప్రైవేటీకరణపైనే బీజేపీ సర్కారు ధ్యాస
- ఉత్పాదకతపై ప్రభావం

న్యూఢిల్లీ : దేశంలో నిరుద్యోగుల సంఖ్య రోజు రోజుకి పెరిగిపోతోంది. పాలకులు ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించకపోవడంతో యువత తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతోంది. కేంద్రంలోని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం పైనే దృష్టి పెట్టింది. ఫలితంగా పీఎస్‌యూలో ఉద్యోగాలకు కోత పెడుతూ వస్తోంది. అధికారంలోకి వస్తే దేశంలో ఏడాదికి రెండు కోట్ల చొప్పున ఉద్యోగాలను సృష్టిస్తామని ఎన్నికలకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అవును సార్,.. ఇప్పుడు నడుస్తోంది కూడా అదేగా!

గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి పురస్కారం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్, గోరఖ్‌పూర్‌లోని గీతా ప్రచురణాలయాన్ని గాంధీ శాంతిపురస్కారం–2021 వరించింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సంస్కారణాత్మకంగా అహింసా, గాంధేయ పద్ధతుల్లో అందించిన గణనీయమైన తోడ్పాటుకుగాను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని గీతాప్రెస్‌కు అందిస్తున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. 100 ఏళ్లుగా అద్భుత సేవలు అందించిన గీతాప్రెస్‌కు

- మిగతా 2 లో

మాడిపోతున్న జనం

ఉత్తరాది భగభగ... 100 మంది మృతి

- వడదెబ్బతో ఆస్పత్రులకు రోగులు
- యూపీలో మూడు రోజుల్లో 54 మంది మృత్యువాత
- దేశవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు

బల్లియా (యూపీ): దేశంలో ఎండలు మండిపోతున్నాయి. అనేక రాష్ట్రాల్లో చాలా రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక ఉత్తరాది భగభగ మండిపోతోంది. ఉత్తర భారతంలో దాదాపు 100 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదికలు పేర్కొంటున్నాయి. ఇక్కడ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంది. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌లో అధిక ఉష్ణోగ్రతలకు అక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత మూడు రోజుల్లోనే వడదెబ్బ కారణంగా అక్కడ 54 మంది మరణించారు. ఒక్క బల్లియా జిల్లాలోనే గడిచిన 24 గంటల వ్యవధిలో 34 మంది ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు, బీహార్‌లనూ 44 మంది వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. యూపీలోని అనేక ప్రాంతాల్లో కొన్ని రోజులుగా 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా బల్లియా జిల్లాలో వడగాల్పులు తీవ్రంగా ఉన్నాయి. మూడు రోజులుగా వడదెబ్బ కారణంగా ఇక్కడ 400 మంది

- మిగతా 2 లో

105 మంది అక్రమ వలసదారుల అరెస్టు

బ్రిటన్‌లో సోదాలు : ఆపరేషన్‌లో పాల్గొన్న రిషి సునాక్

లండన్: అక్రమ వలసదారులను గుర్తించే ఆపరేషన్‌ను బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ చేపట్టారు. స్వయంగా పాల్గొని ఓ కమాండోలా వ్యవహరించారు. రాజధాని లండన్, బ్రెంట్‌లో జరిపిన తనిఖీల్లో ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లతో పాటు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించిన సునాక్ (43) పాల్గొన్నారు. బ్రిటన్‌వ్యాప్తంగా జరిపిన మెరుపుదాడుల్లో మొత్తం 20 దేశాలకు చెందిన 105 మంది విదేశీయులను అరెస్టు చేశారు. 159 చోట్ల దాడుల నిర్వహించి హోటళ్లు, దుకాణాలు, సెలూన్లు, బార్‌లు, కార్ వాషింగ్ సెంటర్లలో పనిచేస్తున్న అక్రమ వలసదారులను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో 40 మందిని జైలుకు తరలించి మిగిలిన వారిని ఇమ్మిగ్రేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ వలసలకు చెక్ పెట్టేందుకు సునాక్ ప్రభుత్వం నడుంబిగించింది. ఇదే క్రమంలో జరిపిన తాజా తనిఖీలు, అరెస్టులపై బ్రిటన్ హోంమంత్రి సువెల్లా బ్రేవర్‌మెన్ స్పందించారు. అక్రమ వలసదారుల వల్ల బ్రిటన్ సమాజానికి ముప్పు వాటిల్లుతోందని, నిజాయతీగా పనిచేసే కార్మికులకు ఉపాధి లభించడం లేదని అన్నారు. అక్రమ వలసదారులు పన్నులు కూడా చెల్లించరని తెలిపారు. బ్రిటన్ చట్టాలను ఉల్లంఘించడాన్ని, సరిహద్దులను అక్రమంగా దాటడాన్ని ఉపేక్షించబోమని తేల్చిచెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు చొరబాట్లను అరికట్టడానికి, ప్రజలను రక్షించడంలో సహాయపడటానికి 24 గంటలూ పని చేస్తున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ కంప్లైన్స్, క్రైమ్ ఎట్ ది హోం ఆఫీస్ డైరెక్టర్ ఎడ్డీ మోంట్‌గోమెరీ వెల్లడించారు. పోలీస్, నేషనల్ క్రైమ్ ఏజెన్సీ (ఎన్‌సీఏ)తో కలిసి పనిచేస్తున్నామన్నారు. చొరబాట్లను కట్టడి చేయడమే కాకుండా అక్రమ రవాణా కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని ఎడ్డీ నొక్కిచెప్పారు.

పీఎస్‌యూల్లో కొలువులు మాయం

(మొదటిపేజీ తరువాయి)

ముందు దేశ ప్రజలకు బీజేపీ మాటిచ్చింది. నిరుద్యోగమనేది లేకుండా చేస్తామంటూ ప్రగల్భాలు పలికారు. కానీ కాషాయ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఉద్యోగాల సంగతి పక్కనబెడితే, ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ) లను అమ్మడమే పనిగా పెట్టుకొని వీటిల్లో ఉద్యోగాలకు కోత పెడుతున్నది. గత పదేళ్లలో 2.7 లక్షల ఉద్యోగాలను తగ్గించింది. మరోవైపు పీఎస్‌యూల్లో కాంట్రాక్టు, రోజూవారి కార్మికులను పెంచుతోంది. 2013 నాటికి మొత్తం 389 పీఎస్‌యూల్లో 17.3 లక్షల మంది ఉద్యోగులు ఉండేవారు. 2023 మార్చి నాటికి వారి సంఖ్య 14.6 లక్షలకు తగ్గిపోయింది. ఒక్క బీఎస్‌ఎన్‌ఎల్‌లోనే 1,81,127 ఉద్యోగాలు తగ్గాయి. వీఆర్‌ఎస్ స్కీమ్‌ల పేరుతో ఆ సంస్థలో ఉద్యోగులను కేంద్రం బలవంతంగా బయటకు పంపించింది. ఎఫ్‌సీఐ, ఓఎన్‌జీసీ వంటి అనేక పీఎస్‌యూల్లోనూ ఉద్యోగుల సంఖ్యను కేంద్రం భారీగా తగ్గించేసింది. ఒకవైపు పీఎస్‌యూల్లో శాశ్వత ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్న కేంద్రం కాంట్రాక్టు, రోజువారి కార్మికుల సంఖ్యను పెంచుతున్నది. 2013లో పీఎస్‌యూల్లో 40 వేల మంది రోజువారి కార్మికులు, 2.9 లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు ఉంటే ఇప్పుడు రోజువారి కార్మికులు లక్ష మంది, కాంట్రాక్టు కార్మికులు 5.2 లక్షల మంది ఉన్నారు. ప్రస్తుతం పీఎస్‌యూల్లోని మొత్తం ఉద్యోగుల్లో కాంట్రాక్టు ఉద్యోగులు 42.5 శాతానికి పెరిగిపోయారు. శాశ్వత ఉద్యోగులతో పోల్చితే కాంట్రాక్టు, రోజువారి ఉద్యోగులకు ఉండే నైపుణ్యాలు, అనుభవం తక్కువ. ఇది మొత్తంగా సంస్థ ఉత్పాదకతపై ప్రభావం చూపిస్తున్నది.

ఇష్టారీతిన అమ్మకం

దశాబ్దాలుగా జాతి నిర్మాణంలో భాగమై, లక్షలాది ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వ సంస్థలను బీజేపీ ఇష్టారీతిన అమ్మేస్తున్నది. పీఎస్‌యూలు గుదిబండగా మారాయని, నష్టాలు తెచ్చిపెడుతున్నాయనే నెపంతో అమ్మకానికి పెడుతున్నది. అయితే పీఎస్‌యూల్లో లాభాలు తెచ్చేవి కూడా ఉన్నాయి. ఇవేమీ పట్టని కేంద్రం పీఎస్‌యూల్లో ఉత్పాదకత తగ్గిందన్న ఒక్క మాటే సాకుగా చెబుతూ వాటిని ప్రైవేట్ పరం చేస్తోంది.

యువత ఆశలపై నీళ్లు చల్లారు: రాహుల్

ప్రభుత్వ రంగ సంస్థ ల్లో దాదాపు రెండు లక్షల ఉద్యోగాలను కేంద్రం తొలగించేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. తద్వారా లక్షలాది మంది యువత ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొంత మంది ఆశ్రిత పెట్టుబడిదారుల కోసమే బీజేపీ ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. పీఎస్‌యూ లు ఒకప్పుడు దేశానికే గర్వకారణంగా ఉండేవనీ, యువత ఉద్యోగాల కలకు అవి నెలవుగా ఉండేవని పేర్కొన్నారు. కానీ, నేడు ఆ పీఎస్‌యూలు ప్రభుత్వ ప్రాధాన్యాల్లో లేనే లేవని దుయ్యబట్టారు. "పీఎస్‌యూల్లో 2014లో 16.9 లక్షల ఉద్యోగాలు ఉండేవి. అవి 2022 నాటికి 14.6 లక్షలకు తగ్గాయి. ప్రగతిశీల దేశంలో ఉద్యోగాలు తగ్గుతాయా? బీఎస్‌ఎన్‌ఎల్‌లో 1,81,127 ఉద్యోగాలు పోయాయి. సెయిల్‌లో 61,928 ఉద్యోగాలు, ఎంటీఎన్‌ఎల్‌లో 34,997, ఎస్ఈసీఎల్‌లో 29,140, ఎఫ్‌సీఐలో 28,063, ఓఎన్‌జీసీలో 21,120 ఉద్యోగాలు పోయాయి" అని రాహుల్ ఆదివారం ట్వీట్ చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన బీజేపీ ఇప్పుడు రెండు లక్షల ఉద్యోగాలను తొలగించేసిందని కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ విరుచుకుపడ్డారు. పైగా వీటిలో కాంట్రాక్టు నియామకాలను రెండింతలు చేసిందని తెలిపారు. ఒప్పంద ఉద్యోగులను పెంచడం అంటే రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ హక్కును హరించడం కాదా? అని ప్రశ్నించారు.

కంపెనీలను ప్రైవేటుపరం చేయాలనే కుట్రేమైనా ఉందా? అని నిలదీశారు. పారిశ్రామికవేత్తలకు రుణాలను మాఫీ చేయడం, ప్రభుత్వ ఉద్యోగాలను కనుమరుగు చేయడం.. ఇదేం 'అమృత్‌కాల్' అని ప్రశ్నించారు. పీఎస్‌యూలకు తగిన ప్రాధాన్యం ఇస్తే ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రజల ఆస్తులని.. భారత వృద్ధి పథాన్ని సుగమం చేసేలా వాటిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు.

ప్రతిఘటించాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడే మీటర్లను బిగిస్తున్నారని అన్నారు. కేంద్రం తీసుకొచ్చే సంస్కరణల వల్ల పెట్రోల్, డీజిల్ చార్జీలు రోజువారీ ఎలా వడ్డిస్తున్నారో విద్యుత్ చార్జీలు కూడా అలానే మోపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రారంభ దశలోనే వీటిని తిరస్కరిస్తే ప్రజలపై భారాలు పడవని చెప్పారు. పార్టీలకు అతీతంగా విద్యుత్ భారాలపై పోరాటాలు నిర్వహించాలని కోరారు. అప్పుడే ప్రభుత్వం భారాలపై వెనకడుగు వేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలని రాష్ట్రంలోని ఎంపీలకు వినతి పత్రాలు ఇవ్వాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు షరతులతో చంద్రబాబు తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను ప్రజలు తిరస్కరించారని గుర్తు చేశారు. ప్రపంచ బ్యాంకుకు దళారీగా మారిన మోదీ ప్రభుత్వం ఆ సంస్కరణలను అమలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తోందని మండిపడ్డారు. ఇలాంటి సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో జరిగినట్లే పెద్దఎత్తున మరో ఉద్యమం జరగాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.మూర్తి మాట్లాడుతూ ప్రజలపై ఎలాంటి భారాలు మోపడం లేదని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ చెప్పారని గుర్తు చేశారు. వివిధ రూపాల్లో వేల కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భారాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి దశలవారీ ఉద్యమాలకు సన్నద్ధం చేయాలని చెప్పారు. సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాస్తి కిషోర్ బాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ ఆదా అయ్యే అవకాశం లేదని, సిబ్బందిని కుదించే భాగంగానే అమరుస్తున్నారని చెప్పారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.కె.ఖాదర్ బాషా మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడు అన్న జగన్... ఇప్పుడు అలానే విద్యుత్ చార్జీలను బాదుతున్నారని అన్నారు. బషీర్‌బాగ్ వంటి మరో ఉద్యమాన్ని జరపాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం.రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి షాడోగా జగన్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ప్రజలకు తెలియకుండానే స్మార్ట్ మీటర్ల పేరుతో వేల కోట్ల భారం మోపుతున్నారని చెప్పారు. ఎస్‌యూసీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.అమర్‌నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజల పరిస్థితులు దిగజారేలా సంస్కరణల పేరుతో భారాలు మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సదస్సు ఉద్దేశాన్ని వివరించి, వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, సీపీఐ, సీపీఎం నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సదస్సులో పాల్గొనలేకపోయినా ఆర్‌ఎస్‌పీ, ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీలు సదస్సు పిలుపునకు మద్దతునిచ్చాయి.

అనేక తీర్మానాలకు సదస్సు ఆమోదం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రతిపాదించిన తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. సర్దుబాటు చార్జీల విధానాన్ని రద్దు చేయాలని, ట్రూఅప్, సర్దుబాటు చార్జీల వసూళ్లు నిలిపివేయాలని తీర్మానించింది. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ప్రభుత్వాలు విరమించాలని, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు పెట్టవద్దని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వృత్తిదారులకు అన్ని రాయితీలు సంపూర్ణంగా అమలు చేయాలని తీర్మానించింది. గృహ వినియోగదారులందరికీ 100 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేసింది. విద్యుత్ పంపిణీ సంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది. అదానీతో సహా వివిధ కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విద్యుత్ సంస్కరణలను ఉపసంహరించాలని డిమాండ్ చేసింది. కేంద్ర విద్యుత్ చట్ట సవరణ బిల్లు-2022 ప్రతిపాదనలను ఉపసంహరించాలని తీర్మానించింది. ఈ కోర్కెల సాధన కోసం ఐక్యంగా ఉద్యమం సాగించాలని పిలుపునిచ్చింది.

క్రిమినల్ ఎమ్మెల్యేలకు సీఎం అండ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపణ

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ : క్రిమినల్ ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. వైసీపీ పాలనలో రౌడీయిజం, గుండా, దోపిడీ, లూటీ, కబ్జా నిత్యకృత్యమయ్యాయన్నారు. కానీ ఏదో ఒకరోజు బాధ్యతగల తన లాంటి దేశభక్తుడు ఎదురు తిరుగుతాడని హెచ్చరించారు. వైసీపీ నాయకులు సమాజాన్ని కులాల పరంగా విభజిస్తారని, ఒక కులం ఎక్కువ, మరొకటి తక్కువ అని తాను ఏనాడు భావించలేన్నారు. వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై పవన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారాహి విజయ యాత్రలో భాగంగా ఆదివారం కాకినాడలో ఆయన ప్రసంగిస్తూ... కోన్‌కిస్కా గాళ్లంటే తనకు భయం లేదన్నారు. 2019లో వైసీపీ గెలిచినప్పుడు ద్వారంపూడి పీకలదాకా మందు తాగి, మద్యం మత్తులో తనను బూతులు తిట్టాడని పవన్ ఆరోపించారు. కాకినాడ ఎమ్మెల్యేకి ఒళ్లు తిమ్మిరిగా వుందని, నోటిదూల ఎక్కువైందన్నారు. ద్వారంపూడి తాతలు, తండ్రులు ఊళ్లో పెద్ద రౌడీలని, వాళ్ల ఫ్యామిలీ బియ్యాన్ని దొంగ రవాణా చేస్తారన్నారు. దొంగ నోట్లు ముద్రించేవాళ్లని... వాళ్లని అప్పటి ఎస్పీ డీటీ నాయక్ సంకెళ్లు వేసి జీపు వెనుక నడిపించాడని తెలిపారు. తనను నానా మాటలు అన్నా బాధలేదని... కానీ జనసేన కార్యకర్తలు, వీర మహిళలపై రాళ్ల దాడి చేయించినందుకు తనకు విపరీతమైన కోపం వచ్చిందన్నారు. వారిని పరామర్శించేందుకు తాను తూర్పుగోదావరి జిల్లాకు వస్తుంటే 144 సెక్షన్ పెట్టారని పవన్ గుర్తుచేశారు. పంతం నానాజీ, సందీప్ పంచకర్లకు తీవ్ర గాయాలయ్యాయని వెల్లడించారు. తనకు అన్నీ గుర్తున్నాయని, ఈ డెకాయిట్ చంద్రశేఖర్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించే బాధ్యతను తాను తీసుకుంటానని జనసేనాని వెల్లడించారు.

క్రిమినల్స్ రాజ్యాలు ఏలితే తనకు నచ్చదని, పాలించేవాడు క్రిమినల్ అయితే ఏం చేయాలని పవన్ ప్రశ్నించారు. ద్వారంపూడిపై జనవాణిలో ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు. 2009 నుంచి రాజకీయాల్లో కొనసాగి ఉంటే వైసీపీ ప్రభుత్వం వచ్చేదికాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సినిమాల్లో బిజీ కావడం వల్ల కాస్త లేట్ అయ్యిందని, తాను ఏం మాట్లాడినా బాధ్యత తీసుకుంటానని చెప్పారు. 151 మంది ఎమ్మెల్యేలు వచ్చారన్న అహంకారంతో, ద్వారంపూడి తనను బూతులు తిట్టాడని పవన్ ఫైర్ అయ్యారు.

లండన్‌లో కేరళ వ్యక్తి హత్య

రూమ్‌మేట్‌తో ఘర్షణలో కత్తిపోట్లు, నిందితుడి అరెస్టు

లండన్ : బ్రిటన్‌లో భారత సంతతి వ్యక్తులు వరుసగా హత్యలకు గురవుతున్నారు. ఈనెల 14న భారత సంతతి గ్రేస్ ఓ మల్లే కుమార్ (19), తేజస్వినీ కొంథమ్ (27) కూడా వేర్వేరు ఘటనల్లో హత్యకు గురయ్యారు. తాజాగా లండన్‌లో మరొక వ్యక్తి హత్యకు గురికావడం, వారం రోజుల్లోనే మూడు హత్యలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. కేరళకు చెందిన 37ఏళ్ల అరవింద్ శశికుమార్ లండన్‌లోని కాంబెర్‌వెల్‌లో అద్దెకు ఉండగా, రూమ్‌మేట్‌తో జరిగిన ఘర్షణతో కత్తిపోట్లకు గురై ప్రాణాలు వదిలారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. శశికుమార్‌పై కత్తితో దాడి చేసిన సల్మాన్ సలీం (25)ను మెట్రోపాలిటన్ పోలీసులు శనివారం అరెస్టు చేసి క్రోయ్‌డాన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. అనంతరం కస్టడీకి తరలించారు. మళ్లీ 20వ తేదీన కోర్టులో హాజరుపరుస్తారు. ఈ ఇద్దరి మధ్య ఘర్షణకు ప్రత్యక్ష సాక్షులైన మరో ఇద్దరు కేరళవాసులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. పదేళ్ల కిందట స్టూడెంట్ వీసాపై బ్రిటన్‌కు వెళ్లిన శశికుమార్ కాంబెర్‌వెల్‌లో అద్దె ఇంట్లో మరికొందరు కేరళ వ్యక్తులతో కలిసి ఉండేవారు. హత్య గురించి సమాచారం తెలియడంతో అర్ధరాత్రి 1.30గంటలకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శశికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఛాతీభాగంలో కత్తి పోట్లు ఉండటం వల్ల శశికుమార్ మరణించినట్లు పోస్టుమార్టంలో తేలింది. పోలీసు అధికారి మాట్లాడుతూ 'మేము ఘటనాస్థలికి వెళ్లే సరికి కత్తి పోట్లకు గురై తీవ్రంగా గాయపడిన వ్యక్తిని గమనించాం. వైద్యులు అత్యవసర చికిత్స అందించే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. మృతుడి కుటుంబానికి సమాచారం అందించాం' అని అన్నారు. 'అంబులెన్స్ క్రూ, మెడిక్‌లు రెండు సత్వర ప్రతిస్పందన వాహనాల్లో ఘటనాస్థలికి హుటాహుటిన చేరుకోగా అడ్వాన్స్‌డ్ పారామెడిక్, ఇన్‌సిడెంట్ రెస్పాన్స్ అధికారి కూడా వెళ్లారని, లండన్ ఎయిర్ అంబులెన్స్ ట్రౌమా టీమ్ కూడా చేరుకుందని లండన్ అంబులెన్స్ సర్వీస్ అధికార ప్రతినిధి చెప్పారు. శశికుమార్‌ను కాపాడే ప్రయత్నాలు ఫలించలేదన్నారు.

సంబంధాల మెరుగుదలకే చైనాకు బ్లింకెన్

బీజింగ్‌లో క్విన్ గాంగ్‌తో భేటీ

బీజింగ్/వాషింగ్టన్: అమెరికా, చైనా దేశాల మధ్య సంబంధాలను చక్కబెట్టుకునే ప్రయత్నాలను అగ్రరాజ్యం చేపట్టింది. ఇదే క్రమంలో ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి ఆంటోని బ్లింకన్ చైనాకు చేరుకున్నారు. ఆయన ఆ దేశంలో రెండు రోజులు పర్యటిస్తారు. పర్యటన మొదటిరోజైన ఆదివారం బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు ఐదేళ్ల తర్వాత అమెరికా అగ్రస్థాయి దౌత్యాధికారి చైనాలో పర్యటించారు. బీజింగ్‌లోని డియాయుటై అతిథిగృహంలో బ్లింకెన్‌కు క్విన్ స్వాగతం పలికారు. సమావేశానికి ముందు ఇద్దరు కరచాలనం చేసుకొని ఆంగ్లంలో మాట్లాడుకున్నారు. చైనా ఉన్నతస్థాయి దౌత్యాధికారి వాంగ్ యీని బ్లింకెన్ కలుస్తారని, అవకాశముంటే అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోనూ భేటీ అవుతారని తెలిసింది. చైనా-అమెరికా మధ్య సంప్రదింపులను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయిగానీ కీలక మార్పులు ఏమీ జరగకపోవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

త్వరలోనే జిన్‌పింగ్‌ను కలుస్తా: బైడెన్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వాషింగ్టన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సమీప భవిష్యత్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలుస్తానని చెప్పారు. తమ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులను చక్కబెట్టుకోవాలని భావిస్తున్నట్లు సంకేతాలిచ్చారు. తాము కలిసి ముందుకెళ్లేందుకు ఉన్న అవకాశాలపై జిన్‌పింగ్‌తో చర్చిస్తానన్నారు. ఇటీవల సంచలనంగా మారిన బెలూన్ ఘటనను ప్రస్తావిస్తూ బహుశ దాని గురించి చైనా ప్రభుత్వానికి తెలిసి ఉండదని బైడెన్ అన్నారు. చైనా, అమెరికా మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. అనేక అంశాల్లో వైరం పెరిగింది. అమెరికా తాగా కసరత్తు ఆ దేశంతో సంబంధాలు చక్కబెట్టుకునే దిశగా సాగుతున్నట్లుగా ఉంది.

అసమ్మతి రాగం

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిపోయారు. దీంతో నెల్లూరులోనూ వైసీపీకి బలం పలచబడింది. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పైనా పార్టీ వేటు వేసింది. అక్కడ వైసీపీ టికెట్ల కోసం నేతల మధ్య వర్గ పోరు మొదలైంది.

క్రోసూరు సభ నుంచి గుడివాడతో మారిన సీఎం స్వరం

బీజేపీపై విమర్శనాస్త్రాలను సంధించడంలో సీఎం జగన్ ఆచితూచి స్పందిస్తున్నారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన బీజేపీ అగ్ర నేతలు అమిత్ షా, నడ్డా జగన్‌పై తీవ్ర విమర్శలు చేసినా, జగన్ మాత్రం బీజేపీపై విమర్శలు చేయకుండా మౌనం వహించారు. పల్నాడు జిల్లా క్రోసూరులో జరిగిన అమ్మఒడి సభలో తనకు బీజేపీ అండదండలు లేకపోయినా ఫర్వాలేదంటూ వ్యాఖ్యానించారు. అదే వ్యాఖ్యలు సైతం గుడివాడలోని టిడ్కో ఇళ్ల పంపిణీ సభకు వచ్చే సరికి తగ్గిపోయాయి. ఆ సభలో తనకు చిన్నా, చితకా పార్టీల సహకారం లేదంటూ మాట మార్చారు. ఇలా బీజేపీపై వ్యాఖ్యానించడంలో క్రమేపీ జగన్ స్వరం తగ్గిపోయింది. బీజేపీ, వైసీపీ రాష్ట్ర ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తెలుగుతేజాలు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. 155 మంది ఓసీఐ (ఓవర్‌సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా) అభ్యర్థులు అర్హత సాధించారు. కాగా, ఈ ఏడాది నెగటివ్ మార్కింగ్ శాతం తగ్గిందని, పెనాల్టీ లేని ప్రశ్నలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ధైర్యంగా పరీక్ష రాశారని ఐఐటీ గువహటి అధికారి వెల్లడించారు. గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రంలో వచ్చిన మార్కులను కలిపి లెక్కేస్తామన్నారు. అగ్రిగేట్ క్వాలిఫైయింగ్ మార్కులను ర్యాంకుల జాబితాలో చేరుస్తామన్నారు.

ఈనెల 4న జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 పరీక్షలు జరిగాయి. మొత్తం 1,80,372 మంది హాజరు కాగా 43,773 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 36,204 మంది అబ్బాయిలు, 7,509 మంది అమ్మాయిలు ఉన్నారు. సోమవారం నుంచి ఉమ్మడి స్థానాల కేటాయింపు (జేఓఎస్‌ఏఏ) కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది.

మంగాయమ్మ, ముసలయ్య దంపతుల్ని

ఆదర్శంగా తీసుకోవాలి

సంతాప సభలో ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర-విజయవాడ : కమ్యూనిస్టు ఉద్యమాన్ని పుణికిపుచ్చుకుని నేటి తరానికి ఆదర్శంగా నిలిచిన దేవ ముసలయ్య, మంగాయమ్మ దంపతుల్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆలిండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. వృద్ధాప్యంతో మరణించిన మహిళా సమాఖ్య నాయకులు దేవ మంగాయమ్మ సంతాప సభ ఆదివారం విజయవాడలో వెన్నెల డయాగ్నోసిస్ భవనం నందు నిర్వహించారు. సభలో వెంకయ్య మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్రంలోనూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోను అట్టడుగు శ్రమజీవులు, గ్రామీణ పేదలు సంక్షేమం, హక్కుల కోసం దేవ ముసలయ్య, మంగాయమ్మ నిరంతర పోరాటం చేశారని కొనియాడారు. ఆమె అధ్యాపకులుగా, ఉపాధ్యాయ సంఘం నాయకులుగా బాధ్యతలు నిర్వహిస్తూ రాజోలు ప్రాంతంలో పార్టీని విస్తృత పరిచేందుకు కృషి చేశారని తెలిపారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. వారిద్దరూ పరిపూర్ణ జీవితం గడిపారని అన్నారు. మంగాయమ్మ భౌతిక కాయం వైద్య కళాశాలకు ఇవ్వడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ నేటి పెట్టుబడిదారీ సమాజంలో మానవ సంబంధాలు విచ్ఛిన్నమై యాంత్రికంగా ఉన్నాయని అన్నారు.

పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించడమే అమరులకు నిజమైన నివాళి అన్నారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ మహిళా సమాఖ్యలో నిబద్ధత కలిగిన నాయకురాలుగా మంగాయమ్మ చేసిన కృషి మర్చిపోలేనిదని అన్నారు. ప్రోగ్రెసివ్ ఫోరమ్ కార్యదర్శి బి.జమీందారు అధ్యక్షత వహించగా సీపీఐ సీనియర్ నాయకులు వై.చెంచయ్య, ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కార్యదర్శి డి.శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, విశ్రాంత ఆచార్యులు సి.నరసింహారావు, డాక్టర్ వి.రామ్ ప్రసాద్, డాక్టర్ జి.పద్మశ్రీ, పీఓడబ్ల్యు కార్యదర్శి పి.పద్మ, మహిళా సమాఖ్య నాయకులు పంచదార్ల దుర్గాంబ, ఆర్.లక్ష్మీదేవి తదితరులు మాట్లాడుతూ అమరుల త్యాగాలను కొనియాడారు. తొలుత మంగాయమ్మ కుటుంబ సభ్యులను సభకు జన విజ్ఞాన వేదిక నాయకులు వి.సదానందం పరిచయం చేశారు. కార్యక్రమంలో డి.సుజాత, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి అధ్యక్షులు చంద్రానాయక్ అమరులను స్మరిస్తూ విప్లవ గీతాలు ఆలపించారు.

మాడిపోతున్న జనం

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రి పాలయ్యారు. ఇప్పటి వరకు 54 మంది ప్రాణాలు కోల్పోయారు. జూన్ 15న 23 మంది, మరుసటి రోజు 20 మంది, తాజాగా 11 మంది మరణించారని బలియా జిల్లా వైద్యాధికారులు ఆదివారం తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారి ప్రకారం, ఆస్పత్రిలో రోజుకు సగటున 7 నుంచి 9 మరణాలు నమోదవుతున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో మరణించిన రోగులందరూ 60 ఏళ్లు పైబడిన వారేనని వారేనని అధికారులు తెలిపారు. 'జిల్లా ఆస్పత్రి రికార్డుల ప్రకారం, 40 శాతం మంది రోగులు జ్వరంతో ఉన్నారు. 60 శాతం మంది ఇతర వ్యాధులతో బాధపడుతున్నారు. అయితే జిల్లాలో ఇప్పటివరకు ఇద్దరు వ్యక్తులు మాత్రమే వడదెబ్బ కారణంగా మరణించారు' అని ప్రధాన వైద్యాధికారి (సీఎంవో) డాక్టర్ జయంత్ కుమార్ తెలిపారు. అయితే వారి మరణానికి అనేక అంశాలు కారణమని, అందులో వడదెబ్బ కూడా ఒకటి అని చెప్పారు. జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందితో పాటు ఇతర కారణాలతో బాధితులు ఆస్పత్రిలో చేరుతున్నారని, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, డయేరియాలతో చనిపోతున్నారని తెలిపారు. ప్రతిరోజూ 125 నుంచి 135 మంది రోగులు ఇక్కడ చేరుతుండటంతో ఆస్పత్రి ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోందని చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.కె.యాదవ్ తెలిపారు. 'జూన్ 15న జిల్లా ఆస్పత్రిలో 154 మంది రోగులు చేరారు. అందులో 23 మంది రోగులు వివిధ కారణాల వల్ల మరణించారు. జూన్ 16న 20 మంది రోగులు మరణించగా, మరుసటి రోజు పదకొండు మంది మరణించారు. వారంతా 60 ఏళ్లు పైబడిన వారే' అని ఆయన వివరించారు. ఇదిలాఉండగా, జిల్లా ఆస్పత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ దివాకర్ సింగ్ మరణాలకు కారణం గురించి అజాగ్రత్తగా వ్యాఖ్య చేసినందున, అతన్ని తొలగించి, అజంగఢ్‌కు పంపారు. డాక్టర్ ఎస్.కె.యాదవ్‌కు సీఎంఎస్ బాధ్యతలు అప్పగించినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. యూపీతో పాటు ఉత్తర భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లోని అనేక జిల్లాలు కూడా తీవ్రమైన వేడి కారణంగా ప్రజలు అల్లాడుతున్నారని వాతావరణ శాఖ నివేదికలు పేర్కొంటున్నాయి. శనివారం అజంగఢ్ డివిజన్ ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ ఓ.పి.తివారీ మాట్లాడుతూ లక్నో నుంచి ఆరోగ్య శాఖ బృందం బలియాకు వచ్చి పరీక్షలు నిర్వహిస్తుందని, ఆ తర్వాత మరణాలకు గల కారణాలను నిర్ధారిస్తామని చెప్పారు. 'బహుశా ఒక వ్యాధి ఉండవచ్చు. అది గుర్తించబడలేదు. ఈ సమయంలో ఉష్ణోగ్రత కూడా ఎక్కువగా ఉంటుంది. వేసవి, చలికాలంలో మధుమేహ వ్యాధిగ్రస్తులలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, రక్తపోటు ఉన్నవారిలో మరణాల రేటు పెరుగుతుంది' అని తెలిపారు. ఇదిలాఉండగా, జిల్లా మెజిస్ట్రేట్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు, కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు ఏర్పాటు చేశామన్నారు. ఇది కాకుండా, 15 పడకలు కూడా పెంచామని చెప్పారు. ఆరోగ్య శాఖను కూడా కలిగి ఉన్న ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ మాట్లాడుతూ 'ఉష్ణోగ్రత గురించి సమాచారం లేకుండా నిర్లక్ష్యంగా వ్యాఖ్య చేసినందున సూపరింటెండెంట్‌ను తొలగించడం జరిగింది. రాష్ట్రంలోని ప్రధాన వైద్యాధికారులు, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్లు అందరూ ప్రతి రోగిని గుర్తించి, వారికి చికిత్స అందించాలి' అని ఆదేశించారు. ఇక బీహార్‌లో సంభవించిన 44 మరణాలలో 35 మంది పాట్నాలోనే ప్రాణాలు కోల్పోయారు.

నలంద వైద్య కళాశాల ఆస్పత్రి (ఎన్ఎంసీహెచ్)లో 19 మంది, పీఎంసీహెచ్‌లో 16 మంది రోగులు మరణించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో తొమ్మిది మంది మరణించారని ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. రోజువారీ వాతావరణ బులెటిన్ ప్రకారం, షేక్‌పురాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 45.1 డిగ్రీల సెల్సియస్, పాట్నా 44.7, గయ 44.1, పశ్చిమ చంపారన్ 44.4, భోజ్‌పూర్ 44.5, ఔరాంగాబాద్‌లో 44.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. పాట్నాలోని అన్ని పాఠశాలలు జూన్ 24 వరకు మూసివేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

గాంధీ శాంతి పురస్కారం లభించినందుకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ ట్వీట్‌చేశారు. ప్రజల్లో సామాజిక, సాంస్కృతిక సంస్కరణలను తెచ్చిన గీతాప్రెస్‌ను కొనియాడారు.మోదీ నాయకత్వంలోని జ్యూరీ ఈ పురస్కారానికిగాను గీతా ప్రెస్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శాంతి, సామాజిక సామరస్యంలో గాంధేయ సిద్ధాంతాలను ప్రోత్సహించడంలో గీతాప్రెస్ అందించిన తోడ్పాటును మోదీ గుర్తుచేసుకున్నట్లు పేర్కొంది. గీతా ప్రెస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఈ పురస్కారానికి ఎంపిక కావడం సామాజిక సేవలో ఆ సంస్థ కృషికి దక్కిన గుర్తింపుగా ప్రకటన వెల్లడించింది.

1923లో గీతాప్రెస్‌ను స్థాపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రచురణాలయాల్లో ఇది ఒకటి. 16.21కోట్ల శ్రీమద్ భగవద్గీత పుస్తకాలతో పాటు 14 భాషల్లో 41.7 కోట్లకుపైగా పుస్తకాలను ప్రచురించింది. మానవాళి అభ్యున్నతికి సమ్మిళితంగా అందించిన తోడ్పాటుకు గుర్తింపుగా గాంధీ పురస్కారాన్ని ఈ సంస్థకు ఇస్తున్నట్లు మంత్రిత్వశాఖ ప్రకటన పేర్కొంది. గాంధీ 125వ జయంత్యుత్సవాల సందర్భంగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాల ప్రదానాన్ని 1995లో మొదలు పెట్టారు. దేశం, జాతి, భాష, కులం, మతం, లింగ భేదం లేకుండా గాంధీ శాంతి మార్గంలో నవ ప్రపంచ నిర్మాణానికి కృషిచేసిన వ్యక్తులు, సంస్థలకు ఈ పురస్కారాన్ని అందిస్తారు. పురస్కారం రూపేణ రూ.కోటి నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు శ్రేష్ఠమైన సంప్రదాయ హస్తకళ/చేనేత వస్త్రాలు అందజేస్తారు. గాంధీ శాంతి పురస్కారం-2019ని ఒమన్ నాటి సుల్తాన్ ఖబూస్ బిన్ సైద్ అల్ సైద్ అందుకోగా 2020లో బంగాబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ అందుకున్నారు.

వైసీపీ పాలనలో 'నేరాంధ్రప్రదేశ్'గా రాష్ట్రం

ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: వైసీపీ పాలనలో నేరాలు, ఘోరాలు అధికమయ్యాయని రాష్ట్రం నేరాంధ్రప్రదేశ్‌గా మారిందని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రజలకు ఆయన బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో సీఎం వైఖరి, ప్రభుత్వ అసమర్థత నేరగాళ్లకుళ్ల మరింత ఊతం ఇచ్చేలా ఉందని ధ్వజమెత్తారు. గతమూడు రోజుల్లో జరిగిన నాలుగు అంశాలను ఆయన ప్రస్తావిస్తూ రాష్ట్ర పరిస్థితిస్థిపై ప్రజలు ఆలోచన చేయాలని చంద్రబాబు కోరారు. మహిళల భద్రత, ఆస్తుల రక్షణ, చట్ట సభల్లో గౌరవం లేదని, రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవంటూ నాలుగు అంశాలను లేఖలో ప్రధానంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, వైసీపీ నేతల భూకబ్జాలు, నేరగాళ్ల విశృంఖలత్వం, బిల్లులు రాక కాంట్రాక్టర్ల ఆత్మహత్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, గన్ కల్చర్ అడ్డు అదుపు లేకుండా వ్యాపిస్తున్నాయని మండిపడ్డారు. నవ్యాంధ్ర ప్రజలు జగన్‌రెడ్డి పాలనలో ప్రతిరోజు అనుభవిస్తున్న నరకయాతన చూసి ఎంతో ఆవేదనతో ఈ బహిరంగ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేదనడానికి బాలుడి సజీవ దహనం పెద్ద ఉదాహరణ అని చెప్పారు. తండ్రి లేని ఆ కుటుంబంలో తన సోదరికి అండగా ఉండడమే ఆ బాలుడు చేసిన తప్పా అని ప్రశ్నించారు. మహిళలపై వేధింపులు జరుగుతుంటే కఠిన చర్యలు తీసుకోని వైసీపీ ప్రభుత్వ విధానాలు ఇలాంటి ఘటనలకు ఊతం ఇవ్వడం నిజం కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డ జోలికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి రాష్ట్రం లో ఉండుంటే....అక్కకు అండగా నిలిచిన ఆ బాలుడి ప్రాణాలు పోయేవి కాదని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు ఆస్తుల కబ్జా నిత్యకృత్యం అయ్యిందని దుయ్యబట్టారు. దశాబ్దాల పాటు శ్రమించి ప్రజలు సంపాదించుకున్న ఆస్తిని వైసీపీ రాక్షసులు కబ్జా

చేస్తున్నారని ఆరోపించారు. అనంతపురంలో తన ఆస్తిని ఆక్రమించుకుంటే ప్రింటింగ్ ప్రెస్ యజమాని వంశీ... కబ్జా దారులను ఎదుర్కొ నలేక ప్రాణాలు తీసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసీపీ అక్రమార్కుల సెటిల్మెంట్లు, ప్రజల ఆస్తుల కబ్జాలు, బెదిరింపులు, వేధింపులకు ఈ ఘటన సాక్ష్యంగా నిలుస్తోందని మండిపడ్డారు. చివరికి అతను రాసిన సూసైడ్ నోటును కూడా తారుమారు చేశారని ఆరోపించారు. అమలాపురంలో మున్సిపల్ చైర్మన్ పై ఏకంగా వైసీపీ కౌన్సిలర్ భర్త దాడికి దిగడం ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుకు అద్దం పడుతోం దని మండిపడ్డారు. విశాఖలో జరిగిన కిడ్నాప్ వ్యవహారం రాష్ట్రం లో అధ్వాన్న శాంతి భద్రతలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు పెంచి పోషించిన గూండాలే ఎంపీ కుటుంబాన్ని కిడ్నాప్ చేశాయన్నారు. ఈ నాలుగు ఘటనలు కేవలం మూడు రోజుల వ్యవధిలో జరిగాయంటే రాష్ట్రం లో పరిస్థితుస్థి లు ఎలా ఉన్నాయోప్రతి ఒక్క పౌరుడు ఆలోచించాలన్నారు. ఇక సీఎం ఇంటి సమీపంలోనే గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్ముతున్నారని, మరోవైపు (జ)గన్ కల్చర్ ప్రజలను భయకంపితులను చేస్తోం దని దుయ్యబట్టారు. కస్టోడియల్ టార్చర్ ద్వారా రాష్ట్రం లో మానవ హక్కుల ఉల్లం ఘన తీవ్రంగా జరుగుతోందని అమెరికా విదేశాంగ శాఖ తన నివేదికలో చెప్పిం దని గుర్తుచేశారు. ఎన్సీఆర్బీ నివేదికలు కూడా రాష్ట్రం లో పెరుగుతున్న క్రైం రేటును సూచిస్తున్నాయని విమర్శించారు.

24 వరకు ఒంటిపూట బడులు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడకూడదని మరోవారం రోజుల పాటు ఒంటిపూట బడులు కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాల యాజమాన్యాలు ఒంటిపూటే పనిచేస్తాయి. పాఠశాల బోధనా సమయం: ఉదయం 7:30 నుంచి 11:30 వరకు నిర్వహించాలని పేర్కొన్నారు. రాగి జావ: ఉదయం 8:30 నుంచి 9:00 వరకు,మధ్యాహ్న భోజనం 11:30 నుంచి 12:00 వరకు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు.

మోదీ విధానాలు ఎండగట్టాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ద్రోహం చేసి అభివృద్ధికి ఏమాత్రం సహకరించని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆంధ్ర రాష్ట్ర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్న జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి స్పష్టం చేశారు వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల శాఖ కార్యదర్శుల వర్క్ షాప్ గోపి అధ్యక్షతన ఆదివారం జరిగింది ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసినా జగన్‌మోహన్ రెడ్డి పల్లెత్తుమాట కూడా మాట్లాడకుండా మౌనవహించడం రాష్ట్రాభివృద్ధిని ఆమడ దూరంలో ఉంచడమేనన్నారు. దేశంలో నరేంద్ర మోదీ పాలన దుర్మార్గపు పాలనగా, కార్పొరేటర్లకు అనుకూలంగా, ప్రజలపై తీవ్ర భారాల మోపుతూ అత్యంత పాశాచికంగా పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తూ ఈ దేశాన్ని దివాలా తీయించే పరిస్థితికి తీసుకొస్తున్నాడని తెలిపారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా రాష్ట్రాన్ని అప్పులు పాలు చేస్తున్నాడని మండిపడ్డారు. మోదీ నరహంతక పాలన చేస్తుంటే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మోదీ విధానాల్ని సమర్థించడం ఎంత వరకు సమంజసమో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి బాలకృష్ణ, మండల కార్యదర్శి తులసి రాజన్, వైఎస్ మణి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఏసు మృతి దళిత ఉద్యమానికి తీరని లోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ: దళిత, పౌరహక్కుల సాధన కోసం ఉద్యమించిన నాయకుడు కుక్కల ఏసు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. విజయవాడ గిరిపురంలో ఆదివారం ఏసు భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ఏసు ఇంటివద్ద జరిగిన సంతాప సభలో విల్సన్ మాట్లాడారు. పౌరహక్కుల రక్షణకు, దళితుల ఆత్మ గౌరవానికి తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి ఏసు అని కొనియాడారు. విజయవాడ నగరంతో పాటు, ఉమ్మడి కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అణగారిన వర్గాల ఆత్మగౌర వానికి, అభ్యున్నతి కోసం ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏసు పోరాడారని, తన నివాస ప్రాంతంలో పేదలకు ఇళ్లు, శ్మశాన వాటిక ఏర్పాటు కోసం స్థానికులను సమీకరించి ఉద్యమించారన్నారు. ఆయన తండ్రి కుక్కల రాములు సీపీఐ కార్యకర్తగా చిత్తశుద్ధితో, అంకితభావంతో పోరాటాలు చేశారని ఏసు తండ్రి వారస త్వాన్ని పుణికిపుచ్చుకున్నారని చెప్పారు. ఏసు మరణం ఎర్రజెండా ఉద్యమానికే కాక దళిత ఉద్యమానికి తీరని లోటు అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప కూడా ఏసుకు నివాళులర్పించారు.

నేతల నివాళి:ఈ నెల 15వ తేదీన తుది శ్వాస విడిచిన హక్కుల ఉద్యమ నేత కుక్కల ఏసు అంతిమ యాత్ర సందర్భంగా ఆదివారం ఓపీడీఆర్ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, వామపక్ష నేతలు, పౌర హక్కులు, ప్రజాసంఘాల నాయకులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏసుకు నివాళులర్పించారు. ముందుగా ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు ఏసు భౌతికకాయంపై ఓపీడీఆర్ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఏసు ఉద్యమ చరిత్రలోని ముఖ్య ఘట్టాలను వివరించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్.బాబూరావు, అమరావతి దళిత జేఏసీ నాయకులు పి.బాలకోటయ్య, సీపీఐ ఎంఎల్ నాయకులు జె.కిషోర్‌బాబు, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి కె.పొలారి, పీఓడబ్ల్యూ నాయకులు గంగాభవాని, విరసం నాయకులు అరసవిల్లి కృష్ణ, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు బి.విజయ, హక్కుల ఉద్యమ నాయకులు సి.భాస్కరరావు, గిరిపురం ఇళ్ల నిర్మాణ కమిటీ నాయకులు కంభంపాటి మోజేస్, అరుణ్‌నగర్ ఇళ్ల నిర్మాణ కమిటీ నాయకులు దేవరాజు, ప్రొగ్రెసివ్ ఫోరం నాయకులు బి జమిందార్, సమతా పార్టీ నాయకులు వీవీ కృష్ణారావు, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్, సయ్యద్, అప్పలస్వామి కాలేజీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కోతకు గురవుతున్న వంతెన...

పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-చింతపల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రధాన రహదారిపై ఉన్న వంతెనలు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. సాధారణంగా వర్షాలు బాగా కురిస్తే వరదపోటుకు కోతలకు గురయ్యే రహదారులు నేడు వర్షాలు కురవక పోయినప్పటికీ కోతకు గురవుతుండడం వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మన్యంలో వంతెనల వద్ద నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే ఈ విధంగా కోతలు ఏర్పడుతున్నా యని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. వాహనచోదకులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా భారీ మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. మండలంలోని చౌడపల్లి పంచాయతీ కేంద్రానికి సమీపాన చెదలపాడు గ్రామం వద్ద ఈ మధ్యకాలంలో నిర్మించిన నూతన వంతెన అప్పుడే కోతకు గురైంది. కోత ఏర్పడిన చోట కనీసం ప్రమాద హెచ్చరికగా సూచిక బోర్డు కూడా పెట్టకుండా తూతూ మంత్రంగా చిన్న కర్రకు ఆకుపచ్చటి గుడ్డను కట్టి వదిలేశారు. చింతపల్లి నుండి చౌడుపల్లి, చెరకుంపాకుల మీదుగా పాడేరు వెళ్లే ఈ ప్రధాన రహదారిలో వంతెన వద్ద ఈ విధంగా మట్టి కోతకు గురవడం, ఆ వంతెన మీదుగానే ఆర్టీసీ సర్వీసులతో పాటు, ఇసుక ట్రాక్టర్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా వర్షం కురిస్తే వాగును తలపించే విధంగా నీరు నిలిచే అవకాశం ఉన్న పెద్ద గెడ్డ వంతెనకు కూడా మరమ్మతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సిద్ధాంతపర అవగాహన పెంచుకోవాలి

పార్టీ శ్రేణులకు ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర - మహానంది: సిద్ధాంతపరమైన అంశాలపైన ప్రతి కార్యకర్త అవగాహన పెంపొం దించుకుని సమాజంలో అసమానతలు తిప్పికొట్టేం దుకు, ప్రజా చైతన్యానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మహానందిలోని శాలి వాహన కల్యాణ మండపంలో సీపీఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమ య్యాయి. తొలుత ఆంధ్రప్రదేశ్ చేతివృత్తి దారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు జెండా ఆవిష్కరించారు. మండల సీపీఐ మండల కార్యదర్శి వీరప్ప అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో ముప్పాళ్ల నాగేశ్వరావు మాట్లాడుతూ ఈ దేశంలో బానిస సమాజం నుంచి పెట్టుబడి దారి సమాజం వరకు జరిగే పరిణామ క్రమాన్ని అందరూ అవగాహన చేసుకోవాలన్నారు. మతం, దేవుడి పేరుతో దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నద న్నారు. మతోన్మాదాన్ని తరిమికొట్టేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. దున్నేవాడికి భూమి లేదు, పనిచేసే వానికి పనిలేదు, బడా బడా వ్యాపారులు,రాజకీయ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని పేద మధ్య తరగతుల వాళ్ళను కొల్లగొట్టడాన్ని అరికట్టాల న్నారు. భారతదేశం భిన్న మతాలకి, భిన్న కులాలకు భిన్న ఆచారాలకు నిలయమని, అలాంటి జాతి విశిష్టతని కమ్యూనిస్టులు వారసులుగా ఉండి ప్రజల్లోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామా నాయుడు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య, మోటారాముడు, రఘు రామ మూర్తి, సుగుణమ్మ, జిల్లా సీపీఐ సోషల్ మీడియా ఇన్చార్జ్ ధనుంజయ్, ఆర్ సామెలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ద్రోహి మోదీ

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్మికద్రోహిగా వ్యవహరిస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు విమర్శించారు. ఇక్కడి మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షులు పీవీఆర్ చౌదరి అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా మహాసభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఓబులేసు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చారన్నారు. దీనివల్ల కార్మికులు సంఘాన్ని ఏర్పాటు చేసుకునే హక్కును కోల్పోతారన్నారు. 8గంటల పనిగంటల విధానం కూడా నిర్వీర్యం అవుతుందన్నారు. నేడు దేశంలో కార్మికుల పరిస్థితి కట్టుబానిసలకన్నా హీనంగా ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ బాటలోనే రాష్ట్రంలో జగన్ పాలన సాగుతోందన్నారు. జగన్ కార్మిక హక్కులను హరించివేస్తున్నారన్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తూ జైళ్లకు పంపుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో ఈ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ కరోన సమయంలో కార్మికులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆకస్మిక లాక్‌డౌన్ ప్రకటించి కార్మికుల జీవితాలతో ఆటలాడుకుందన్నారు. లాక్‌డౌన్ కారణంగా వేలాది చిన్న పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడ్డారన్నారు.లక్షలాది మంది తమ ఉపాధిని కోల్పోయారన్నారు. కార్మికుల జీవితాలతో ఆటలాడుకున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కార్మికుల అన్ని రకాల సమస్యలను పరిష్కార దిశగా ఉద్యమాల కార్యాచరణ సాగాలన్నారు.

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యాసిన్, కొత్తకోట

ఏఐటీయూసీ జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా యాసిన్, కొత్తకోట వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎస్‌డి సర్దార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎస్‌కె ఖాసీం, వర్కింగ్ ప్రసిడెంట్‌గా కె హనుమంతరావు, కోశాధి కారిగా అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులుగా సుభాన్ నాయుడు, కె జీవరత్నం, మల్లికార్జున, ఎస్‌కె ఇబ్రహీం, బాలిరెడ్డి, పీవీఆర్ చౌదరి, పి.మస్తాన్ రావు, దాసరి మల్లికార్జున, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎల్ లోకేశ్ ఎన్నికయ్యారు. మొత్తం 25 మంది సభ్యులతో జిల్లా సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓపీఎస్‌ను అమలు చేయకుంటే గద్దె దిగాలి

సీపీఎస్ పోరాట సంఘాల నేతలు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్ర సమయంలో ప్రతిచోటా ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ కాకుండా ఓపీఎస్ అమలు చేయాలని, లేకుంటే తక్షణం గద్దె దిగాలని సీపీఎస్ పోరాట సంఘాల నేతలు తేల్చి చెప్పారు. సీపీఎస్ పోరాట సంఘాలన్నీ ఒకే తాటిపైకి వచ్చాయని, దానిలో భాగంగా భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను విలేకరుల సమావేశంలో నేతలు వివరించారు. ఏపీసీపీఎస్‌ఈఏ గౌరవ సలహాదారుడు బాజి పఠాన్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీపీఎస్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకువస్తున్న జీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. జీపీఎస్‌ను స్వాగతించిన నేతలతో సీపీఎస్ ఉద్యోగులు ఎవరూ లేరని అన్నారు. ఉద్యోగ జేఏసీ నేతలు స్వార్థం కోసం పని చేస్తున్నారని ఆక్షేపించారు. జీపీఎస్ బాగుందని భజన చేస్తున్న జేఏసీ నాయకులకు అంత బాగుంటే ముందుగా మీరు అమలు చేసుకొని తర్వాత ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని అన్నారు. తాము పోరుకు సిద్ధమని తెలిపారు. ఈ ఉద్యమాలలో అన్ని సంఘాలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర తాత్కాలిక అధ్యక్షుడు ఆర్.నరసింహం మాట్లాడుతూ తాము ఓపీఎస్ సాధించే వరకు పోరాడతామని అన్నారు. ఏపీసీపీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సి.ఎం.దాస్ మాట్లాడుతూ గతంలో ఉద్యోగులతో బీఆర్‌టీఎస్ రోడ్డు నిండిపోయిందంటే సీపీఎస్ ఉద్యోగులే కారణమన్నారు. ఈ ప్రభుత్వం తమను వద్దనుకుంటుందా అని ప్రశ్నించారు. తాము కూడా ప్రజల్లో భాగమేనన్న విషయం మరువరాదన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సెల్‌లో మా విన్నపం వినకుండా మమ్మల్ని దూరం పెట్టారని ఆయన తెలిపారు. జేఏసీ నాయకులు మాకు ప్రాధాన్యత ఇవ్వకుండా చేశారన్నారు.

ఏపీసీపీఎస్ సెక్రటేరియట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోట్ల రాజేష్ మాట్లాడుతూ జీపీఎస్ గురించి పూర్తి సమాచారం లేకుండా జేఏసీ నాయకులు బాగుందని ఎలా చెబుతారని, తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈనెల 19, 26 తేదీలలో గ్రామ, వార్డు సచివాలయంలో స్పందన కార్యక్రమంలో సీపీఎస్ రిఫరెండంగా జీపీఎస్‌ను తాము ఒప్పుకునేది లేదని వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 19 నుంచి 26 వరకు రాష్ట్రంలో ఉన్న 175 మంది శాసన సభ్యులకు వినతి పత్రాలను హెచ్చరిక పత్రాలుగా అందజేస్తామని అన్నారు. జులై 2న ఉమ్మడి జిల్లా కలెక్టరేట్‌ల ముందు ధర్నా చేపడతామని తెలిపారు.

వడ్డేకు రావుల పరామర్శ

విశాలాంధ్ర-గన్నవరం: రైతు సంఘం నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరావుకు కాలు వేలు దెబ్బతినడంతో ఉయ్యూరు గ్రామంలో ఆయన స్వగృహంలో అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, రైతు నాయకులు యలమంచిలి శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కామల ఉమామహేశ్వరరావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్నీడు యలమందరావు కాలు దెబ్బ తగలడంతో కొండపల్లి మండలం కోటికలపూడిలోని ఆయన స్వగృహంలో రావుల వెంకయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కామల ఉమామహేశ్వరరావు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు.

జులై 23న ప్రజా సింహ గర్జన ఆవిర్భావం

- సుపరిపాలనే కొత్త పార్టీ లక్ష్యం
- పారిశ్రామికవేత్త రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ 'ప్రజా సింహ గర్జన' ఆవిర్భవించబోతోంది. సుపరిపాలనే లక్ష్యంగా ఈ పార్టీని ప్రారంభించనున్నట్లు ప్రముఖ పారిశ్రామిక వేత్త రామచంద్ర యాదవ్ ప్రకటించారు. జులై 23న పార్టీని స్థాపించనున్నట్టు ఆయన ఆదివారం విజయవాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో యాదవ్ మాట్లాడుతూ పార్టీ స్థాపించనున్న రోజే గుంటూరు-విజయవాడ మధ్య నాగార్జున యూనివర్సిటీ ముందు ప్రజా సింహగర్జన పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్రానికి రాజకీయ గ్రహణం పట్టిందని, ఎవరు అధికారంలో ఉన్నా ఏదో ఒక వర్గం వెనుకబాటుకు గురవుతూనే ఉందని ఆయనన్నారు. దశాబ్ద కాలాన్ని పరిశీలిస్తే రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వ్యవసాయాన్ని వదిలి వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందని, రైతులకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. నైపుణ్యం కలిగిన ఆంధ్రా యువత ప్రపంచ వ్యాప్తంగా ప్రతిభ చూపిస్తుంటే రాష్ట్రంలో మాత్రం ఉపాధి అవకాశాలు కరవయ్యాయని వ్యాఖ్యానించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ఇప్పటివరకు జరిగిన దోపిడీని కొత్త పార్టీ బహిర్గతం చేస్తుందని ఉద్ఘాటించారు. వైసీపీ, టీడీపీ రాజకీయ పార్టీల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విముక్తి కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ పాలనలో కొన్ని కుటుంబాలు మాత్రమే అభివృద్ధి చెందాయని ఏ వర్గ అభ్యున్నతి కోసం ఆ పార్టీ పాటుపడలేదని విమర్శించారు. రౌడీ, హత్యా రాజకీయాలు, ఫ్యాక్షన్ పార్టీ వైసీపీ, పార్టీ ఏర్పాటు, అధికారంలోకి రావడం దురదృష్టమన్నారు. దశాబ్దాల రాజకీయ గ్రహణాన్ని వదిలించి, నవ శకాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వచ్చేనెల 23న నిర్వహించే ప్రజా సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు.

సాహితి

అభ్యుదయ సాహిత్యానికి చిరునామా అవసరాల

పెనుగొండ లక్ష్మీనారాయణ,
అరసం జాతీయ కార్యదర్శి, సెల్: 9440248778

అభ్యుదయ సాహిత్యోద్యమానికి స్ఫూర్తి ప్రదాత గురజాడ సాహిత్యాన్ని మన కప్పగించిన, అప్పజెప్పిన ప్రగతిశీల సాహితీవేత్తలలో ఒకరు అవసరాల సూర్యారావు. కాలక్రమంలో అవసరాల విస్మృతిలోకి జారిపోయారు. ఎంతగా వారి పేరు వినబడకపోయినా, కనబడకపోయినా వారు సృష్టించిన సాహిత్యావసరం మాత్రం నేడు మరింత ఉంది.

తూర్పుగోదావరి జిల్లా పొందూరు గ్రామంలో 14 డిసెంబర్ 1923 న జన్మించిన అవసరాల సూర్యారావు శత జయంతి సంవత్సరమిది. వారి జీవితాన్ని, సాహిత్యాన్ని మననం చేసుకునే సందర్భమిది. అవసరాల చిన్నతనంలోనే సంస్కృతాంధ్ర కావ్యాలను అధ్యయనం చేశారు. విజయ నగరం మహారాజ కళాశాల నుంచి పట్టభద్రలయ్యారు. వందేమాతరం, విశాలాంధ్ర, ఆంధ్రప్రభ దినపత్రికలలో పని చేశారు. విజయనగరం, విజయవాడ వీరి కార్యక్షేత్రాలు. 30, 31 జులై 1955 లో శ్రీశ్రీ అధ్యక్షతన విజయవాడలో జరిగిన ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మహాసభలో పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యునిగా ఎంపికయ్యారు. అవసరాల వారి పేరుతో పాటు ఉత్తరాంధ్రకే చెందిన మరో యిద్దరు ఉత్తమ అభ్యుదయ రచయితలు అవసరాల రామకృష్ణారావు, బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు గుర్తుకు వస్తారు.

అవసరాల వారు అందించిన సాహిత్యం: మహాకవి గురజాడ డైరీలు, లేఖలు మాటామంతి మొదలగు రచనలకు సంపాదకత్వం వహించారు. ప్రచురించారు. గురజాడ ఆంగ్లంలో రాసిన STOOPING TO RAISE కథను "సంస్కర్త హృదయం"గా తెలుగు చేశారు. ప్రఖ్యాత హిందీ రచయిత ముల్కరాజ్ ఆనంద్ నవల 'కూలీ' ని అనువదించారు. 'నెహ్రూ లేఖలు' (1969) ను తెలుగు వారికి అందించారు. వీరు నాటక రచయితగా 'నల్లబూట్లు' నాటిక (1948), 'పంజరం' నాటకం (1958) అందించారు. 'ఆకాశ దీపాలు' కథా సంపుటి (1952), అవసరాల కథలు (1955) తెలుగు కథానికా సాహిత్యంలో చిరస్మరణీయాలు. అనిశెట్టి సుబ్బారావు, బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాలకృష్ణతో కలిసి 'కల్పన' కవితా సంకలనానికి 1953 లో సంపాదకత్వం వహించారు.

'కళలలో వాస్తవికత' వంటి వ్యాసాలు రాశారు. కొన్ని గేయాలనూ అల్లారు. ముందుగా వీరి కథలను గురించి మాట్లాడుకుందాం. ఆకాశ దీపాల సంపుటిలోని వీరి 'కొత్త పుంతలు' కథ స్పష్టమైన మార్క్సిస్టు ఆర్థిక దృక్పథం నుంచి తెలుగులో వచ్చిన కథలలో అత్యుత్తమమైనది. ఈ కథను అరసం గుంటూరుజిల్లా శాఖ అక్టోబర్ 1988లో ప్రచురించిన 'కథా స్రవంతి' మూడవ సంకలనంలో సంకలనకర్తగా నేను చేర్చాను. తరువాత కొడవంటి కాశీపతిరావు సంకలనంచేసిన 'కథలవాకిలి' (1999), విశాలాంధ్ర ప్రచురణాలయం వారి 'ఉత్తరాంధ్ర కథలు' (2014)లోనూ ఈ కథ చేరింది. తెలుగులో వచ్చిన అనేక కథా సంకలనాలలో అవసరాల వారి ఈ కథే కాదు మరే కథా చేరలేదు. ఎందుచేతనో మరిచిపోయారు వీరిని మరి!నాకెంతగానో నచ్చిన కథకులకు పాఠ్యాంశంలాంటి ఈ కథానికను రేఖామాత్రంగా పరిచయంచేస్తాను. ఊళ్లోఅన్నారు. ఈ కథా కేంద్రం విజయనగరం కావచ్చు. చుట్టల కంపెనీ యజమాని కార్మికులు ఎంత మొత్తుకున్నా, అడిగినా, ఆందోళన చేసిని కూలీరేట్లు పెంచడు. పైగా పోలీసులను ఉసిగొల్పుతాడు. అక్కడ పనిచేసే పైడితల్లి కార్మికులను సమావేశ పరిచి వారినుండి మూలధనం సేకరించి వారందరి సమష్టి యాజమాన్యంలో చుట్టల కంపెనీని ఏర్పాటు చేసి చౌక ధరకు అమ్మకం ప్రారంభించాడు. లాభాలు ఆర్జించటమే కాదు, ఇంతకు ముందు వారు పని చేసిన యజమాని తన కంపెనీని మూసి వేసి వీళ్ల దగ్గరే చుట్టలు కొని అమ్మటం జరుగుతుంది. ఈ కథ శ్రామిక శక్తి విజయానికి ప్రతీక. 'అవసరాల కథలు' సంపుటిని కథావాహిని శీర్షికన ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ గద్దె లింగయ్య సంపాదకత్వంలో 1955 లో ఒక్క రూపాయికే అందించింది. ఇందులో లలిత కళ్లు, ఉక్కు పిడికిలి, మనోరథం, మేకప్, పిచ్చిబొమ్మ, ఆల్ ఈజ్ వెల్ కథలున్నాయి. ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో 'ఉప్పు పిడికిలి' ని 'ఉక్కు పిడికిలి' గా చిత్రించిన కథ యిది. వరహాలు నిస్వార్థపరుడైన కాంగ్రెస్ కార్యకర్త. 'స్వరాజ్యం లేనిదే నౌఖరీ నాకెందుకని' రిజిస్ట్రారు ఉద్యోగానికి తిలోదకాలిచ్చాడు. 'వరహాలే కాంగ్రెస్! కాంగ్రెస్సే వరహాలుగా గుర్తింపు పొందాడు. తీరా ఎన్నికల సమయానికి అప్పటి వరకూ కాంగ్రెసును వ్యతిరేకించిన, అవహేళన చేసిన డబ్బు చేసినాఅప్పలస్వామి కాంగ్రెస్‌లోకి చేరి శాసనసభకు పోటీ చేయాలనే తలంపుతో ఉంటాడు. అయితే వరహాలుకు కమ్యూనిస్టు పార్టీ మద్దతు ఉందనే భయం అతన్ని వెంటాడుతుంది. ఈ కథలో 'డబ్బున్నవాడు రాజకీయాల్ని బిజినెస్ చేస్తున్నాడు', వ్యాపారస్తుల్ని రాజకీయాల్లోంచి తరమడమే మన పని' అనే ఈ మాటలు దాదాపు ఏడు దవాబ్దాల తరువాత నేడు మరెంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

అవసరాల సూర్యారావు శత జయంతి నివాళి

మరో మంచి కథ "ఆల్ ఈజ్ వెల్" : "ఏ ప్రభుత్వానికీ విచారణ లేకుండా మనిషిని బంధించే అధికారం లేదు" , "రాజకీయ ఖైదీల్ని రాజకీయ ఖైదీల్లాగా చూడాలి", "ఏ నేరం లేకుండా మనల్నిక్కడ బంధించి, అక్కడ మన కుటుంబాల్ని మార్చటానికి వీళ్లెవ్వరు?"- "మానవ చైతన్యం ముందు తుపాకులు, ఉరికొయ్యలు, జైలుగోడలు, విచ్చుకత్తులు వోడిపోక తప్పదనే ధైర్యం, స్థైర్యం" యిచ్చారు ఈ కథలో. ఏనాడో రాసిన ఈ కథలో పౌరహక్కులను ప్రస్తావించారు. ఇంకా ఈ కథ నేటి పరిస్థితులకీ అన్వయిస్తుంది.

కృష్ణాజిల్లాలోని 'ఎలమర్రు' గ్రామంలో ఆనాడు జరిగిన దుశ్చర్యలను గుర్తు చేశారు. 'ఎర్రజెండా జిందాబాద్' నినాదాలనూ వినిపించారు. రాజకీయ డిటెన్యూల కష్టాలను, వారు జైలులో పడుతున్న క్లేశాలను చిత్రించిన కథ ఇది. ఇంత జరుగుతున్నా జైలు అధికారులకు "ఆల్ ఈజ్ వెల్" గా కనిపించటం అవసరాల వారు వేసిన చురక.

కల్పన కవితా సంకలనం గురించి: "అభ్యుదయ సాహిత్య పథంలోని గత ఉద్యమాల శతాబ్దపు 5వ దశకానికి ముందరి బలమైన కవితా పాదముద్రలీ కల్పన". ప్రగతిశీల కవితోద్యమ మహాప్రస్థానంలో ఉరుకులెత్తిన నవచేతన దళమెత్తిన పతాక రెపరెపలీ కల్పన. 1953 లో చేతన సాహితి వెలువరించిన ఈ కవితా సంకలనాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ నిషేధాన్ని తొలగించింది. ఈ కవితా సంకలనంలో 'చింతన' శీర్షికన సంపాదకులు గొలుసుకట్టు రీతిలో తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అందులో అవసరాల వారు రాసినది పేర్కొనదగినది.

"కాల్పనిక యుగం తన ముందు యుగంపై తిరగబడినట్లే కాల్పనిక కవితా యుగంపై ఆధునిక యుగం తిరుగుబాటు చేసి విప్లవ పరివర్తన తీసుకొచ్చింది. ఈ మహోదయ ప్రథమ రేఖలు శ్రీ శిష్టా రచనలలో కనిపించాయి. కాల్పనిక యుగంపై విముఖత్వము నూతనత్వం కోసం ఒక అవ్యక్తవేదన ప్రస్ఫుటమౌతాయి. అధునాతన పాశ్చాత్య సాహిత్య రీతుల నుంచి విడిపడి, నూతన పథాన్ని అవలంబించి, రానున్న మార్పుకు అంకురార్పణ చేసిన ప్రథముడీయన. శ్రీశ్రీతో విస్పష్టంగా ఆధునిక యుగం ప్రారభమైందని చెప్పవచ్చు. ఈ యుగ వేధనను, అశాంతిని, విముక్తికై పోరాడుతున్న ప్రగతి శక్తుల సంఘర్షణను తన కావ్యాలలో శ్రీశ్రీ ప్రచండ శక్తితో రూపొందించాడు. ఈయన ధోరణి అనేకులకు మార్గదర్శకమయింది" అని విశ్లేషించారు. ఈ విశ్లేషణ కవిత్వ ప్రక్రియపై అవసరాల వారికి ఉన్న నిశితమైన, స్పష్టమైన అవగాహనను వ్యక్తం చేస్తుంది. 55 మంది కవుల 129 కవితలున్న కల్పన సంకలనంలో అవసరాల వారివి నాలుగు కవితలున్నాయి. అవి: కత్తెరలో కంఠం, కాటూరు, యలమర్రు, కడలూరు.., కలకత్తా కాళి ముందు, నిజంగా, బలంగా!

"కూలిపేటల కదల కాకిచే కబురంపు
గగనమంతా నిండ ఎర్రజెండాలెగురు!
ఎందరో అందరూ మన బాట! మన పాట!
ఎందరో అందరూ అందరూ అందరూ
ముందుకే! ముక్తికే! ఎందరో అందరూ!"- ఎందరో మృతివీరులను, 'కత్తెరలో కంఠం' లో స్మరించుకుంటూ విముక్తి పథంలో పయనిద్దాం అని పిలుపిచ్చారు.

"అది ఆంధ్రావని గ్రామం ఎలమర్రు../ అది కృష్ణాజిల్లా గ్రామం కాటూరు'...కట్టుబట్టలు బెరడులా ఒలిపిస్తే అడగండయ్యా అడగండీ!... అడుగుతున్నాం, కావాలి సమాధానం! తేలాలి నిజా నిజం!!" అని పాలక పక్షాన్ని బోనులో నిలబెట్టి ప్రశ్నిస్తున్నారు. బాధితుల పక్షాన తన గొంతును వినిపించారు. "నిజంగా, బలంగా, బలంగా నిజంగా/ తెలుగు తోట, పూలపాట/ స్వర్ణ స్వప్న స్వర్ణ రేఖ/ తెలంగాణ! తెలంగాణ" అని కీర్తిస్తూ వీరాంగన తెలంగాణలో "యుగ యుగాల పరిపాలన/ తరతరాల పరపీడన/ పోతున్నది పోతున్నది/ఏడ్చిఏడ్చి పోతున్నది/ ఓడి ఓడి పోతున్నది!!" అని నిజాం నిరంకుశపాలన నుండి తెలంగాణా విముక్తిని కాంక్షిస్తూ ఆ సాయుధ సమరానికి సంఘీభావంగా అవసరాల వారు సర్పించిన కవితే "నిజంగా, బలంగా!" బెంగాల్ కరువుకు చిత్రించిన కవిత "కలకత్తా కాళి ముందు".

అవసరాల వారి కవితలు గేయరీతిలో సాగాయి. మంచి తెలుగు నుడికారంతో శక్తిమంతంగా భావాన్ని అందిస్తూ సాగాయి. ప్రజా పక్షం వహించిన కవితలు, ప్రజా పోరాటాల విజయాలను కాంక్షించిన కవితలు, ఎర్రజెండాను సమున్నతంగా ఎగరేసిన కవితలు. అవసరాల వారు నాటక రచయితగా సుప్రసిద్ధులు. 1948 లో రాసిన 'నల్లబూట్లు' ను పోలీసు యంత్రాంగానికి ప్రతీకగా చిత్రించారు. ఈ నాటికలో రాజ్య స్వభావం, పోలీసు యంత్రాంగం సహాయంతో ప్రభుత్వాలను నడపటం, పోలీసులు సహజత్వాన్ని కోల్పోవటం కనిపిస్తాయి. అనేక సంఘటనలు సమకాలీనతను దర్శింపజేస్తాయి.

అవసరాల వారి మరో ప్రసిద్ధ నాటకం 'పంజరం' (1958) గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తు పోటీలలో ఉత్తమ రచన బహుమతి పొందింది. అకారణంగా భర్త ఆమెను అనుమానించి, వేధించి వెళ్లగొట్టిన నేపథ్యంలో జ్యోతి అనే మహిళ జీవితాన్ని నాటకంగా మలిచారు. "జీవితంలో అనేక పరిస్థితుల వలన, పతనమౌతున్న వ్యక్తులు ఎప్పుడూ అలాగే పడి ఉండాలని సమాజం శాసిస్తుంది. వాళ్లు మానవులుగా ప్రశాంతంగా జీవించడానికి హక్కు లేదని ఏ సమాజం నిర్దేశిస్తుంది! అలాంటి సమాజాన్ని కాదని ప్రతిఘటించే హక్కు నాకూ వుంది.అని సమాజాన్ని ప్రశ్నించే, స్వేచ్ఛను కాంక్షించే భావనను ఈ నాటకం ప్రతిభావంతంగా చెప్పింది. స్త్రీల పట్ల అవసరాల వారికున్న అభిమానం, సానుభూతిని ప్రదర్శించే నాటకమిది. నల్లబూట్లు, పంజరంలను అరసం కార్యకర్తలు వల్లూరు శివప్రసాద్, గంగోత్రి సాయి తమ సంపాదకత్వంలో వెలువడిన నాటికలు, నాటకాలు సంకలనంలో చేర్చారు.

అవసరాల సూర్యారావు 24 మార్చి 1963 న అనారోగ్యంతో 40 సంవత్సరాల పిన్న వయసులోనే అమరులయ్యారు. జీవితంలో ఎన్నో కష్టాలను, ప్రమాదాలను ఎదుర్కొన్న వ్యక్తి అవసరాలవారు. ప్రజా రచయిత, ప్రగతిశీల సాహితీవేత్త అవసరాల వారికి జోహార్లు.

(33 వ విజయవాడ పుస్తక మహోత్సవంలో 16 ఫిబ్రవరి 2023 న చేసిన ప్రసంగానికి అక్షర రూపం)

అరసం బహుమతి పొందిన కవితలు-2023



'అవును మాదే'

-చిర్ర సతీష్

తాను తినకపోయినా...తన కడుపు మాడినా...
తన రక్త మాంసాలతో...
నిన్ను కడుపులో పెట్టుకొని
ప్రాణం పోసిన అమ్మకు...
నీ ప్రాణం మీద హక్కు ఉండదా!
చెప్పులు అరిగేలా...కాదు కాదు...
కాళ్లు అరిగేలా జీవితంలో పరిగెత్తి పరిగెత్తి...
ఆఫీసుల్లో, బజారుల్లో, పొలాల్లో, ఫ్యాక్టరీల్లో, షాపుల్లో...
చెమటలు కక్కి...ఆత్మగౌరవాన్ని మింగి...అవమానాలకు కృంగి...
నీ పళ్లెంలో అన్నం పెట్టిన నాన్నకు నీ ప్రాణం మీద హక్కు ఉండదా?
మేనేజ్మెంట్‌ల ముందు తల దించుకుని
జీతం కోసం చేతులు చాచి...ఒక నెల జీవితాన్ని సాకలేక...
చిరిగిన దుస్తులతో...అతుకుల బతుకులు ఈడుస్తూ...
కటిక నేలపై పుస్తకాన్ని దిండుగా పరుచుకొని...
పొద్దున్నే నీకు ఉత్సాహంగా అక్షరం తినిపించిన మాస్టారుకి
నీ ప్రాణం మీద హక్కు లేదా?
తోడుగా ఉన్న స్నేహితులకు ...ఎక్కడో ఉన్న బంధువులకు...
అండగా ఉన్న తోబుట్టువులకు...కనిపెట్టుకొని ఉన్న కాలనీకి...
బూచినీ పోగొట్టిన డాక్టర్‌కి... ఆటకి, పాటకి, బడికి, గుడికి
నీ ప్రాణం మీద హక్కు లేదా?
ఛల్ ఛల్ కాదు అంటే నేనొప్ప! నీ ప్రాణం మాది...
నీ ప్రాణం మా ప్రాణం
జీవితంలో అందరూ ఓడి ఓడి గెలిచిన వారే
ఒక్క ఓటమికి...నిన్ను మేము ఓడనివ్వము
ఒక్క క్షణంలో...నిన్ను జారనివ్వము ఈ జన్మలో నిన్ను వీడనివ్వము...
నీ జీవితంలో ఏదైనా చేసుకో...ఓడిపో...ఓర్చుకో...గెలుచుకో...
అది నీ ఇష్టం...కానీ నీ ప్రాణం మాది...
నువ్వు మాకు ఇష్టం...చాలా ఇష్టం...
ఆత్మహత్యలు వద్దు- జీవితమే ముద్దు.

(అరసం యువ వచన కవితా పోటీలు-2023 లో తృతీయ బహుమతి పొందిన కవిత.)

డా. ఎన్. గోపి 'క్రియ ఒక జీవన లయ' ఆవిష్కరణ జూన్ 25న

ప్రముఖ కవి డా. ఎన్. గోపి రచించిన కవితాసంపుటి "క్రియ ఒక జీవన లయ" ఆవిష్కరణ 25 జూన్ 2023 ఆదివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు)లో జరుగుతుంది. సీనియర్ పాత్రికేయులు కే. రామచంద్ర మూర్తి ఆవిష్కరిస్తారు. డా. వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారు. కిల్లాడ సత్యనారాయణ(ఐ.పి.ఎస్) కృతిని స్వీకరిస్తారు. డా. మామిడి హరికృష్ణ, వంగల హర్షవర్ధన్, డా. ఎస్. రఘు, కుడికాల వంశీధర్ పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

రాజాం రచయితల వేదిక 101వ సమావేశం

రాజాం రచయితల వేదిక 101వ సమావేశం ఈ నెల 25 ఆదివారం ఉదయం 9.30 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో డా.అల్తి మోహనరావు అధ్యక్షతన జరుగుతుంది. ఆ సభలో 'అర్ధనారి నవల-సామాజిక పరిశీలన' అనే అంశంపై రాజాపు శాంతారావు ముఖ్యప్రసంగం చేస్తారు.

గార రంగనాథం, 9885758123

డబ్బు మనుషులు

-డా॥తక్కోలు మాచిరెడ్డి, సెల్: 9666626546

గబ్బు మనుషులు
మానవత్వం లేని మర మనషులు
వారి రక్తంలో సంవేదన ఉండదు.
మంట తప్ప ఓదార్పు ఉండదు.
అన్నీ లెక్క ప్రకారమే జరగాలంటారు
వారిని క్యాలిక్యులేటింట్ టైప్
అని అంటారు ఆంగ్లంలో
డబ్బు మనిషి కోసం
మనిషి డబ్బు కోసం కారాదు.
పెట్టుబడి ప్రభుతలోనూ
మనిషికి మమతే ముద్దు
మమత లేని జీవితం
ఎండిన చెట్టులాంటిది
మరి అది చిగురించదు
మహా మనీషి కార్ల్‌మార్క్స్ ప్రకారం
వాణిజ్యం, వ్యాపారం కాదు జీవితం
సామాజిక సంబంధాల సమాహారమే
మనిషని మార్క్స్ నిర్వచనం.

మందరపు హైమవతి
సెల్: 9441062732

కవిత్వం వెన్నెల కురిపించిన 'విశాల నయనం'

వచన కవితా పితామహుడు కుందుర్తి కథ, నవల, నాటకం, ఆత్మకథ అన్నిటినీ వచన కవితా ప్రక్రియలోనే రాయాలని చెప్పారు. చెప్పడమే కాకుండా రాసి చూపించారు. శీలా వీర్రాజు కూడా అలాగే రాశారు. ఇప్పుడు ఈతకోట సుబ్బారావు కూడ విశాలాక్షి పత్రికకు గత పదమూడేళ్లుగా సంపాదకీయాలను కవిత్వ ప్రక్రియలోనే రాశారు. ఈ కవిత్వ సంపాదకీయాలను ఏర్చి కూర్చి 'విశాల నయనం' గా తెచ్చారు ఇటీవల. సుబ్బారావు సుప్రసిద్ధ కవి, రచయిత కొన్ని ప్రత్యేక సంచికలకు సంపాదకులుగా వ్యవహరించారు. 'విశాలాక్షి' సాహిత్య పత్రికే అయినా సమకాలీన సంఘటనలపై, రాజకీయాలపై పదునైన అస్త్రాలను సంధించారు. ఏ పత్రికకైనా సంపాదకులు కవులైనపుడు వారి వాక్య విన్యాసాలు అన్యాయాల పట్ల కొరడా దెబ్బల్లాగానే ఉంటాయి. పాలకులను నిగ్గదీస్తాయి. అదే కదా కవిత్వం శక్తి.

శ్రీశ్రీ, ఆరుద్ర రాజకీయ కవిత్వం రాశారు. సిరిసిరి మువ్వలు, ప్రాసక్రీడలో శ్రీశ్రీ ఆనాటి రాజకీయాల మీద బాణాలు సంధించారు. ఆరుద్ర 'కూనలమ్మ పదాలు' లో సమకాలీన సంఘటనలపై తన కలం కత్తిని ఝుళిపించారు. దేవీప్రియ రన్నింగ్ కామెంటరీ, గజ్జెల మల్లారెడ్డి వ్యాసాలు, రాంభట్ల కృష్ణమూర్తి కార్టూన్ కవితలు అశేష పాఠకులను అలరించాయి. సంపాదకీయం, కవిత్వం రెండూ పరస్పర విరుద్ధాలు. సంపాదకీయం అంటే వాస్తవం పరిస్థితులపై వ్యాఖ్యానం. కవిత్వం ఊహాకు సంబంధించినది. ఈతకోట సుబ్బారావు మాత్రం ఈ రెండింటికీ సమన్వయం సాధించి విశిష్టమైన కవిత్వ సంపాదకీయాలు రాశారు. రాజధాని వీధుల్లో రైతుల పోరాటాన్ని గురించి రాసినా, సోనూసూద్‌పై ఆదాయపు పన్ను శాఖ వాళ్లు దాడి చేసినా తన ఆగ్రహాన్ని నిర్భీతిగా ప్రకటిస్తారు.

దిల్లీలో రైతుల ఆందోళన గురించి 'మట్టిబడి' లో లక్షలాది భూమి కవుల స్వేద ఘోష/ కరకు కసాయి కత్తులపై రాసిన కన్నీటి భాష అంటూ ఈ ఉద్యమంలో వారు విజయాన్ని సాధిస్తారని 'స్వాతంత్ర్యాన్నే త్యాగాలతో సాధించుకొన్న జనాలకి విజయం అసాధ్యం కాని దుక్కి కాదు' అని అంటారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా బీద, ధనిక భేదాలు తొలగిపోలేదు. ఒకపక్కగా ఆకాశ హార్మ్యాలు, మరోపక్క చెట్టు నీడల ఇళ్లు. చేపలు పట్టేవారిని కొంతకాలం వేటకు వెళ్లొద్దు అని ప్రభుత్వం నిషేధిస్తుంది. సముద్రం మీద వేటకు వెళ్లేనే వారి కడుపులు నిండడం అంతంత మాత్రం. అసలు వెళ్లకపోతే వాళ్ల ఆకలి ఎలా తీరుతుందని కవి ప్రశ్నిస్తారు. తళుకు ముక్కల్ని బోటు నిండా నింపుకొని/ ఉదయ సంధ్యల్లో తీరం చేరినవేళ/ ఎదురొచ్చే యిల్లాలి మోముపైన/ చిరునవ్వుల జాతరకి మూడు మాసాల నిషేధం/ ఈ మూడు మాసాలూ ఉప్పునీటి కన్నీళ్ల సంగమమే" అని వారి దుర్భర స్థితిని అక్షర చిత్రంగా ఆవిష్కరిస్తారు 'నిషిద్ధ రుతువు' లో.

కవికి మాతృభాషంటే అభిమానం. ఇప్పుడు పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికే పట్టం కట్టారు. ప్రాథమిక దశలో పిల్లలు మాతృభాషలోనే విద్యాభ్యాసం చేయాలని కొఠారి కమిషన్ చెప్పినా ఇరుగు పొరుగులైన తమిళులు, కన్నడిగులు తమ మాతృభాషాభిమానాన్ని చాటుకొంటున్నా తెలుగువారికి చీమ కుట్టినట్లుండదు. దీనినే 'అమ్మచేతి వంట' లో రాష్ట్ర గీతాన్ని ఇంగ్లీషులో పాడగలరా?/ మాతృభాషలో చదువు చప్పిడి కూడు కాదు/ అవి మెదడుకు మేత పెట్టే మృష్టాన్న భోజనం/ " అని మాతృభాష ప్రాముఖ్యాన్ని చాటి చెప్పారు.



విశాల నయనం,
రచయిత: ఈతకోట సుబ్బారావు,
పుటలు:126, వెల: రూ.100/-
ప్రతులకు: ఈతకోట సుబ్బారావు, 24/1697, రెండవ వీధి, రవీంద్రనగర్, నెల్లూరు-524004,
సెల్: 9440529785.

ఏ విషయం మీద రాయాలో, దేనికి స్పందించాలో కవికి బాగా తెలుసు. అంబేద్కరు విగ్రహాన్ని అవమాన పరచిన సంఘటన మనకు తెలుసు. ఆ సంఘటనకి మనం సిగ్గుతో తలదించుకోవాల్సిన దుస్థితి. దీనికి కలవరపడి కవి చెప్పులు మెళ్లో వేసుకొని నడుస్తున్నాను/ చౌరస్తాలో నీ విగ్రహం మీదట/ మోకాళ్లపై వంగి క్షమాపణలను కోరాలని/ అంటారు. 'నిష్కృతి' కవితలో చదివిన బడిలోనే అంటరానితనంతో/ పసి హృదయం మీది గాయంమరకతో/ నిలువెత్తు మనసు పుండైననాడు అని సమాజం తనపైచేసిన గాయాన్ని గురించి దుఃఖపడువారు. తరాలుగా చేసిననేరానికి/ ఇప్పుడైనా నిష్కృతికావాలి" అంటారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు మానవుడే వినియోగదారుడు. మనిషికి అవసరమున్నా లేకపోయినా ఒకటి కొంటే ఒకటి ఉచితమని, ఒక చీర ఖరీదుకే నాలుగు చీరలు వస్తాయని పదేపదే ప్రకటనల మాయాలోకంలో విహరింప చేస్తున్నారు పెట్టుబడిదారులు. దీనినే 'వైకుంఠపాళీ' లో మార్కెట్ మనిషిని ఎలా దోచుకుంటుందో, దాని వికృత స్వరూపాన్ని చిత్రీకరించారు. గుజరాత్‌లో పటేల్ భారీ విగ్రహాన్ని నిర్మించారు. ఎన్నో వేల కోట్లు ఖర్చుపెట్టి, గొప్పవారిని గౌరవించాల్సిందే కానీ విగ్రహాలు నెలకొల్పికాదు. వారి ఆశయాలను పాటించాలి ప్రతి ఒక్కరు. ఈ విషయం గురించే 'రెండుపుంజాల మధ్య' లో అభివృద్ధి విగ్రహాల్లో కాదు/ నిగ్రహం లాంటి ఆశయంలో ఉండాలి/ ప్రపంచం యావత్తూ నావైపు కాదు/ నా దేశం వైపు చూడాలి/ అని విగ్రహాలు మాత్రమే నిర్మిస్తే చాలదని అంటారు. కాలక్రమంలో బాలు, మంగళంపల్లి, బాపు, శ్రీశ్రీ, పెద్దిభొట్ల, సినారె, సోమసుందర్ మొదలగు వారు మరణించినపుడు స్పందించిన సంపాదకీయాలు హృదయాలను కదలిస్తాయి. శివారెడ్డి గురించి విరసం, నేలపట్టులో వలసపక్షుల పండుగ గురించి ఎన్నో వైవిధ్యమైన విషయాలపై ఆర్ద్రమైన కవితలు రాశారు.

కథల మేష్టారు 'పెద్దిభొట్ల మరణానికి' ఒక మహావాక్యం మధ్యలోనే ఆగిపోయిందని/ కథా సాహిత్యం తల్లడిల్లిపోతుంది" అని అంటారు. శివారెడ్డి గురించి అలుపెరుగని కవితా యాత్ర గురించి 'నడుస్తూనే ఉన్నాడు' కవితలో హృదయాస్తమయాల మధ్య సంధిగీతంలా/ చరణాలు చరణాలుగా నడుస్తూనే ఉన్నాయి/ అని శివారెడ్డి వారి అలుపెరుగని కవితాయాత్ర గురించి పద చిత్రాన్ని చిత్రిస్తారు. పఠాభి, సి.పి.బ్రౌన్ జయంతి సందర్భంగా రాసిన సంపాదకీయాలు వారి గురించి ఎన్నో విశేషాలను తెలియజేస్తాయి. పత్రికారంగంలో సంపాదకుల పాత్ర విశిష్టమైనది. వార్తా రచనలో, వాక్య నిర్మాణంలో ఏ పత్రిక పద్ధతి ఆ పత్రికకే ఉంటుంది. సంపాదకీయం అనగానే అది మరింత విలువైనది.

తెలుగు కవిత్వానికి అపరిచితమైన ఈ ప్రక్రియలో సంపాదకీయాలు రాసి, పాఠకులను మెప్పించారు. సమకాలీన సంఘటనలను తీసికొని, వాటికి కవిత్వ పరిమళాలు అద్దిన ఈ కవిత్వ సంపాదకీయాలు అందరినీ అలరిస్తాయి. 'భాషానది, మట్టిబడి, స్వేదఘోష, శాంతిలయ మొదలైన పదబంధాలు ఆకర్షిస్తాయి. జలపాత శైలితో మొదట నుంచి చివరి వరకు ఏకబిగిన చదివింపచేస్తాయి. ఈ విశాలనయనానికి 'విశాలాక్షి' కి కవిత్వపుకాటుక పేరుతో ఆంధ్రజ్యోతి సంపాదకులు రాసిన ముందుమాట విలువైనది. గుబాళించే కవిత్వంతో కూడిన ఈ సంపాదకీయాలు తెలుగు సాహిత్యంలో ఒక విభిన్న ప్రక్రియకు చెందినది. సమకాలీన రాజకీయం గురించి, భాషా సంస్కృతుల గురించి రాసిన సంపాదకీయాలు ఆలోచింపజేస్తాయి. అందరూ చదవదగ్గ పుస్తకంగా మలిచినందుకు రచయితను అభినందించాలి.

యూపీలో విద్యుత్ వెతలు

- 94 శాతం మందికి రోజూ అంతరాయాలే
- నోయిడాలో 86 శాతం ఇళ్లకు కోతలే

నోయిడా : ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో తీవ్ర విద్యుత్ కోతలు ప్రజలను వేధిస్తున్నాయి. నోయిడాలోని 86 శాతం కుటుంబాలు, ఉత్తర ప్రదేశ్‌లోని 94 శాతం కుటుంబాలు జూన్ నెలలో రోజువారీ విద్యుత్ అంతరాయాన్ని ఎదుర్కొన్నాయని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ చేసిన సర్వే తెలిపింది. రాష్ట్రంలోని 75 జిల్లాలకుగాను 56 జిల్లాల్లో ఉన్న 14 వేల మంది ప్రతిస్పందనల ఆధారంగా ఈ ఫలితాలు వెలువడ్డాయని లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వే వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌లోని 94 శాతం కుటుంబాలు జూన్‌లో ప్రతిరోజూ విద్యుత్తు అంతరాయాన్ని ఎదుర్కొంటున్నామని, అలాగే వారిలో 65 శాతం మంది ప్రతిరోజు సగటున మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు విద్యుత్తు అంతరాయాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం మీద, 'మాకు 24 గంటల పవర్ బ్యాకప్ ఉన్నందున మాకు తెలియదు' అని ఆరు శాతం మంది చెప్పినట్లు సర్వే తెలిపింది. గౌతమ్ బుద్ధ్ నగర్ జిల్లాలో (నోయిడా) 86 శాతం కుటుంబాలు ఈ నెలలో రోజువారీ విద్యుత్ అంతరాయాన్ని ఎదుర్కొంటున్నట్లు నిర్ధారించాయి. వారిలో 35 శాతం మంది రెండు గంటల కంటే ఎక్కువ సమయం అంతరాయం కలిగి ఉన్నారు. సగటున 43 శాతం మంది తమ ఇళ్లలో రోజుకు ఒకటి లేదా రెండు సార్లు విద్యుత్ అంతరాయాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. అయితే 32 శాతం మంది మూడు నుంచి ఐదు సార్లు, నాలుగు శాతం మంది ప్రతిరోజూ 10 నుంచి 20 సార్లు అని తెలిపారు. 14 శాతం మంది వ్యక్తులు 'మాకు వారంలో 24 గంటలూ పవర్ బ్యాకప్ ఉన్నందున మాకు తెలియదు' అని చెప్పారని సర్వే పేర్కొంది. నోయిడాలో గృహాల నుంచి 4,141 స్పందనలు వచ్చాయి. వారిలో 62 శాతం పురుషులు కాగా, 38 శాతం మహిళలు ఉన్నారు. 'రాష్ట్రంలోని పవర్ కార్పొరేషన్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ, ప్రస్తుత నెలలో 90 శాతానికి పైగా కుటుంబాలు రోజువారీ విద్యుత్ అంతరాయాన్ని ఎదుర్కొంటున్నాయి. జాతీయ విద్యుత్ గ్రిడ్ ద్వారా సరఫరాలు పొందుతున్నప్పటికీ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాల్లో ఒక రోజులో 74 శాతం మంది రోజుకు 2 గంటలకు పైగా విద్యుత్తు అంతరాయాన్ని ఎదుర్కొంటున్నారు' అని లోకల్ సర్కిల్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

యూపీలో పోలీసులపై ఇసుక మాఫియా దాడి : ఇద్దరి అరెస్టు

మథుర : ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఇసుక మాఫియా ఆగడాలు పేట్రేగిపోతున్నాయి. దీంతో పోలీసు పెట్రోలింగ్ బృందం నిఘా పెంచింది. అక్రమ ఇసుక మైనింగ్ కార్యకలాపాలను అడ్డుకోవాలని భావించింది. దీంతో పోలీసులపై ఇసుక మాఫియా దాడికి తెగబడింది. ఈ ఘటన బల్దేవ్ ప్రాంతంలో జరిగినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయని చెప్పారు. కేసులో నిందితులుగా ఎనిమిది మంది ఉండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బల్దేవ్ ఎస్‌హెచ్‌ఓ సంజయ్ త్యాగి మాట్లాడుతూ మొబైల్ పెట్రోలింగ్ బృందం శుక్రవారం సాయంత్రం అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై నిఘా పెట్టిందని, ఇసుక ట్రాక్టర్‌ను నాగ్లాలేఖ గ్రామం వద్ద అడ్డుకోగా వాహనాన్ని బైకుతో ఢీకొట్టిన డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడని చెప్పారు. అతనిని జైవీర్ సింగ్‌గా గుర్తించామని, డ్రైవర్‌ను వెంబడించిన పోలీసులపై సుభాష్, ప్రేమ్‌పాల్, ఓంపాల్, ప్రతాప్, హరిచంద్‌తో సహా మరొకరు దాడి చేశారని త్యాగి వెల్లడించారు. కానిస్టేబుళ్లు అభిషేక్, విశాల్, మోహిత్‌కు గాయాలయ్యాయని, అదనపు సిబ్బందిని రంగంలోకి దించామన్నారు. హరిచంద్, ప్రతాప్‌ను అరెస్టు చేయగా మిగతావారు పరారీలో ఉన్నారన్నారు.

మణిపూర్‌పై ప్రధాని నోరు మెదపరేం? కాంగ్రెస్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో పరిస్థితిపై కాంగ్రెస్ పార్టీ మరోమారు ప్రధాని నరేంద్ర మోదీపై విరుచుకుపడింది. ప్రకృతి విపత్తుల నిర్వహణలో దేశానికున్న గొప్ప సామర్థ్యాలకు ప్రధానమంత్రి తన వెన్ను తట్టుకున్నారు కానీ మణిపూర్ లో ఎదుర్కొంటున్న మానవతా విపత్తు సంగతి ఏంటని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. మణిపూర్‌పై ప్రధాని మరో 'మన్ కీ బాత్' కానీ 'మౌన్' (నిశ్శబ్దం) అంటూ ఎద్దేవా చేశారు. ఒక నెల క్రితం మణిపూర్‌లో జాతుల మధ్య జరిగిన ఘర్షణ హింసలో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ మణిపూర్‌లో శాంతి కోసం ప్రధాని నుంచి ఎటువంటి విజ్ఞప్తి లేదన్నారు. 'ఆడిట్ చేయని పీఎం కేర్ ఫండ్ ఉంది, కానీ పీఎం మణిపూర్‌ను పట్టించుకుంటారా అనేది అసలు ప్రశ్న' అని రమేష్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ప్రపంచ బ్యాంకు నుంచి కేరళకు రూ.1,228 కోట్లు: సీపీఎం వెల్లడి

తిరువనంతపురం : కేరళ నుంచి ఇప్పటికే అందిన రూ.1,023 కోట్లకు అదనంగా ప్రపంచ బ్యాంకు రూ.1,228 కోట్లు మంజూరు చేసిందని అధికార సీపీఎం ఆదివారం వెల్లడించింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) అన్నా బ్జెర్డేతో సమావేశమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ తెలిపారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో గోవిందన్ మాట్లాడుతూ కేరళకు ఇది ఒక ముఖ్యమైన పరిణామమని, ఎందుకంటే ఇది అత్యధిక సంఖ్యలో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటోందని తెలిపారు. అలాగే అనేక అంటువ్యాధులను ఎదుర్కోవలసి ఉంటుందని, వాతావరణ మార్పుల వల్ల గణనీయంగా ప్రభావితమవుతుందని అన్నారు. ఈ నిధులు కేరళకు ఇటువంటి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి సహాయపడతాయని తెలిపారు. బిజెర్డేతో విజయన్ భేటీ అనంతరం, రాష్ట్ర ప్రాథమిక మౌలిక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రపంచ బ్యాంకు హామీ ఇచ్చిందని సీఎంఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సమావేశంలో ప్రపంచ బ్యాంకు సహకారంతో చేపడుతున్న కేరళ పునర్నిర్మాణ కార్యక్రమంతో సహా అనేక ప్రాజెక్టుల పురోగతిపై కూడా చర్చించినట్లు ఆ ప్రకటన తెలిపింది.

పార్టీ పునరుజ్జీవానికి కృషి చేస్తా

త్రిపుర కాంగ్రెస్ అధ్యక్షుడు సాహా

అగర్తల: త్రిపుర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కొత్త అధ్యక్షుడిగా బిరాజిత్ సిన్హా స్థానంలో మాజీ ఎమ్మెల్యే ఆశిష్ కుమార్ సాహా నియమితులయ్యారు. ఈ నియామకంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిర్ణయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే తెలియజేశారని సాహా ఆదివారం పేర్కొన్నారు. త్రిపురలో పార్టీకి నాయకత్వం వహించే అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అజయ్‌కుమార్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 'ఈ బాధ్యత చాలా సవాలుతో కూడుకున్న పని... అయితే పార్టీని పునరుజ్జీవింపజేయడానికి నేను నా వంతు ప్రయత్నం చేస్తాను' అని ఆయన అన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికలలో, 60 మంది సభ్యులున్న త్రిపుర అసెంబ్లీలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. అయితే 2023 రాష్ట్ర ఎన్నికలలో ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు బిరాజిత్ సింఘా, సుదీప్ రాయ్ బర్మన్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 'వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలోపు పార్టీని బలోపేతం చేసేందుకు సీనియర్ నేతలందరినీ విశ్వాసంలోకి తీసుకుని పని చేయాలనుకుంటున్నాను. ఈశాన్య రాష్ట్రంలో సెమీ ఫాసిస్ట్ పాలనను నెలకొల్పిన బీజేపీని ఎదుర్కొనేందుకు పార్టీ పునరంకితం అవుతుందని నేను నమ్ముతున్నాను' అని ఆయన అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన సాహాను బర్మన్ అభినందించారు. గత ఏడాది ఫిబ్రవరిలో బర్మన్‌తో పాటు ఎమ్మెల్యే పదవికి, బీజేపీకి రాజీనామా చేసిన సాహా... ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారు. అయితే, ఎన్నికల్లో ఆయన తన నియోజకవర్గం టౌన్ బర్దోవాలి నుంచి పోటీచేసి ఓడిపోయారు.

రైళ్లను నడపలేనివారు దేశాన్ని ఎలా నడుపుతారు? కేజ్రీవాల్

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే పరిధిలోని రైళ్ల ఏసీ, స్లీపర్ బోగీలు సాధారణ బోగీల కన్నా అధ్వాన్నంగా ఉన్నాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. రైల్వే వ్యవస్థనే నడపలేకపోతే కాషాయ పార్టీ దేశాన్ని ఎలా నడుపుతుందని ప్రశ్నించారు. 'వారు బాగా నడుస్తున్న రైల్వేని నాశనం చేశారు. ఈరోజు ఏసీ కోచ్ రిజర్వేషన్ తీసుకున్నా కూర్చోవడానికి, పడుకోవడానికి సీటు దొరకదు. ఏసీ, స్లీపర్ కోచ్‌లు సాధారణం కంటే అధ్వాన్నంగా ఉన్నాయి. వారికి ప్రభుత్వాన్ని ఎలా నడపాలో తెలియడం లేదు. వారికి అస్సలు అర్థం కాదు. నిరక్షరాస్య ప్రభుత్వం. వారు ప్రతి రంగాన్ని నాశనం చేస్తున్నారు' అని కేజ్రీవాల్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 'రైళ్లను నిర్వహించలేని వారు దేశాన్ని ఎలా నడుపుతారు?' అని ఆయన అన్నారు. ఈ మేరకు ట్వీట్లు చేశారు.

ఉమ్మడి పౌర స్మృతిపై వీధి పోరాటాల్లేవ్

జామియా చీఫ్ మదానీ

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌర స్మృతిని తాము వ్యతిరేకిస్తున్నామని, అయితే ఇందుకు వ్యతిరేకంగా తాము రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలను చేపట్టబోమని జామియా చీఫ్ అర్షద్ మదానీ ఆదివారం చెప్పారు. తమకు 1,300 సంవత్సరాల నుంచి వ్యక్తిగత చట్టాలు ఉన్నాయని, ఇప్పటికీ తాము వాటికే కట్టుబడి ఉంటామని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఉమ్మడి పౌర స్మృతిని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో మదానీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి పౌర స్మృతిపై అభిప్రాయాలు తెలపాలని శాసన పరిశీలక సంఘం ఇటీవలే ప్రజలను, మత సంస్థలను కోరింది. అభిప్రాయాలను తెలపడానికి 30 రోజుల గడువు ఇచ్చింది. దీంతో 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఉమ్మడి పౌర స్మృతిని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చాలా మంది భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్షద్ మదానీ ఆదివారం మాట్లాడుతూ, 1,300 ఏళ్ల నుంచి తమకు వ్యక్తిగత చట్టాలు ఉన్నాయని, ఇప్పటికీ తాము వాటికే కట్టుబడి ఉంటామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వమూ ఇలా చేయలేదన్నారు. దీని అవసరం లేదన్నారు. నిరసనలు ఎంత ఎక్కువగా జరిగితే, హిందూ, ముస్లింలు అంత ఎక్కువ దూరమవుతారని, ఫలితంగా దుర్బుద్ధిగలవారి లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. ఇత్తెహాద్-ఏ-మిల్లత్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మౌలానా తౌకీర్ రజా ఖాన్ మాట్లాడుతూ, యూసీసీని అమలు చేయడమనేది బీజేపీకి ఎన్నికల గెలుపు సాధనమన్నారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ స్పందిస్తూ, యూసీసీ అనవసరమని, ఆచరణసాధ్యంకానిదని, దేశానికి తీవ్ర హానికరమని తెలిపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందిస్తూ, 2018లో ఈ అంశంపై సంప్రదింపుల నివేదికను అప్పటి లా కమిషన్ ప్రచురించిందని, తాజాగా మళ్లీ సంప్రదింపులు ఎందుకో ప్రస్తుత లా కమిషన్ చెప్పడం లేదని అన్నారు.

కరిగిన పట్టాలపై వెళ్లిన ఎక్స్‌ప్రెస్ రైలు

తప్పిన పెను ప్రమాదం

లక్నో: తీవ్ర ఎండల వల్ల కరిగిన రైలు పట్టాలపై ఒక ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లింది. దీంతో ఆ రైలు పట్టాలు వంకరయ్యాయి. లోకోపైలట్ దీనిని గుర్తించడంతో భారీ ప్రమాదం తప్పింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. లక్నోలోని నిగోహన్ రైల్వే స్టేషన్‌లో తీవ్రమైన ఎండ వేడి వల్ల లూప్‌లైన్‌లోని రైల్వే ట్రాక్‌లు కరిగిపోయాయి. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో మెయిన్ లైన్‌లో మరో రైలు నిలిచి ఉంది. దీంతో రైలు పట్టాలు కరిగిన లూప్ లైన్‌పై నీలాంచల్ ఎక్స్‌ప్రెస్ వెళ్లింది. ఈ నేపథ్యంలో కరిగిన ఆ రైలు పట్టాలు వ్యాకోచించడంతో వంకరగా అయ్యాయి. కాగా, రైలు పట్టాలు జరగడం గమనించిన నీలాంచల్ ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్ వెంటనే ఆ రైలును నిలిపివేసి కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో రైల్వే ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఆ స్టేషన్ మాస్టర్ కూడా స్పందించారు. ఆ లూప్‌లైన్ మీదుగా ఎలాంటి రైళ్లు వెళ్లకుండా రైల్వే సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రైలు పట్టాలను సరి చేసే పనులు చేపట్టారు. మరోవైపు అక్కడి నుంచి కదిలిన నీలాంచల్ ఎక్స్‌ప్రెస్ రైలు లక్నో జంక్షన్ స్టేషన్ చేరుకుంది. లోకోపైలట్ ఈ ఘటన గురించి రైల్వే ఉన్నతాధి కారులకు చెప్పారు. దీంతో సీనియర్ రైల్వే అధికారులు, సిబ్బం ది కూడా నిగోహన్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి పరిశీలించారు. లూప్ లైన్‌లోని రైల్వే ట్రాక్ నిర్వాహణలో నిర్లక్ష్యం ఉన్నట్లు నిపుణులు గుర్తించారు. ఈ నేపథ్యంలో దీనిపై దర్యాప్తు చేయాలని లక్నో డివిజనల్ రైల్వే మేనేజర్ సురేష్ సప్రా ఆదేశించారు.

'ఎమర్జెన్సీ' చీకటి యుగం

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ: దేశ చరిత్రలో 'ఎమర్జెన్సీ' కాలం చీకటి యుగమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని సమర్థించే వారిపై అకృత్యాలు జరిగినట్లు గుర్తుచేశారు. ప్రజాస్వామ్య విలువలు కలిగి ఉన్న భారతదేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించిన జూన్ 25వ తేదీని మనం ఎన్నటికీ మర్చిపోలేమని ఆన అన్నారు. 1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయం తెలిసిందే. 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో మోదీ ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీ 'మన్ కీ బాత్' ప్రతి నెలా చివరి ఆదివారం ప్రసారమవుతూ ఉండేది. ఈ నెల 21 నుంచి ఆయన అమెరికా, ఈజిప్టు దేశాల్లో పర్యటించబోతుండటంతో ఈ కార్యక్రమాన్ని ముందుగానే ప్రసారం చేశారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. తన అమెరికా పర్యటన సందర్భంగా జూన్ 21న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఈసారి తనకు లభిస్తోందని మోదీ తెలిపారు. 'మీ జీవితంలో యోగాను అలవరుచుకోవాలని, దానిని మీ దినచర్యలో భాగం చేసుకోవాలని నేను మీ అందరినీ కోరుతున్నాను. మీరు ఇప్పటికీ యోగాతో కనెక్ట్ కాకపోతే, జూన్ 21వ తేదీ ఈ సంకల్పానికి గొప్ప అవకాశం. మీరు యోగాను అలవర్చుకున్నప్పుడు మీ జీవితంలో ఎంత పెద్ద మార్పు వస్తుందో చూడండి' అని మోదీ అన్నారు. సోషల్ మీడియాలో కూడా యోగా దినోత్సవంపై విపరీతమైన ఉత్సాహం ఉందని ఆయన పేర్కొన్నారు. మన దేశ విపత్తు స్పందన సత్తా ఎంతో అభివృద్ధి చెందిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

మోదీ, అమిత్‌షాకు గడ్కరి అంటే గిట్టదు

కాంగ్రెస్ కౌంటర్..!

బెంగళూరు: కర్నాటక పాఠ్యాంశాల నుంచి ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేబీ హెడ్గేవార్, హిందుత్వవాది వీడీ సావర్కర్ పాఠ్యాంశాలను తొలగించడంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ స్పందించింది. గడ్కరిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా ఇష్టపడరని, ఆ కారణంగానే ఆయన ఆర్ఎస్ఎస్‌ను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తుంటారని పేర్కొంది. మహాత్మాగాంధీని చంపిన వ్యక్తి గురించి కాకుండా, గాంధీజీ సిద్ధాంతాలను విద్యార్థులకు బోధించాలని కాంగ్రెస్ పార్టీ బలంగా నమ్ముతోందని ఆ పార్టీ జాతీయ ప్రతినిధి గౌరవ్ వల్లభ్ అన్నారు. దేశంలోని విద్యార్థులు, కర్నాటక విద్యార్థులు హెడ్గేవార్, సావర్కర్ సిద్ధాంతాలను కాకుండా బీఆర్ అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ సిద్ధాతాలు అధ్యయనం చేయాలని వల్లభ్ అన్నారు.

సావర్కర్, హెడ్గేవార్ సిద్ధాంతాలు దేశ ఆలోచనా విధానం కాదనే విషయం గడ్కరీకి కూడా తెలుసునని అన్నారు. కర్నాటక ప్రభుత్వం ఆరు నుంచి పదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకాల్లోని హెడ్గేవార్, సావర్కర్ చిత్రను తొలగించడం దురదృష్టకరమని నాగపూర్‌లో సావర్కర్‌పై పుస్తకం విడుదల సందర్భంగా గడ్కరి వ్యాఖ్యానించారు. సావర్కర్, వివేకానంద ప్రచారం చేసిన భారతీయ, హిందూ సంస్కృతి ఒకటేనన్నారు. సావర్కర్, ఆయన కుటుంబం చేసిన త్యాగాల గురించి యువతరానికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

డీఎంకే నేత వ్యాఖ్యలపై ఖుష్బూ మండిపాటు

చెన్నై: బీజేపీ నాయకురాలు, సినీ నటి ఖుష్బూ సుందర్... తనపై డీఎంకే అధికార ప్రతినిధి శివాజీ కృష్ణమూర్తి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. శివాజీ కృష్ణమూర్తికి సంబంధించిన వీడియోను ఆమె తన ట్విట్టర్ పేజీలో అప్‌లోడ్ చేసి... 'ఇతడి వికృత వ్యాఖ్యలు డీఎంకేలో ప్రబలంగా ఉన్న రాజకీయ సంస్కృతిని తెలియజేస్తున్నాయి' అని విమర్శించారు. అతనిలాంటి వారు ఆ పార్టీలో ఇంకా చాలా మంది ఉన్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ట్యాగ్ చేస్తూ... 'అతను నన్ను మాత్రమే అవమానించలేదు... మిమ్మల్ని, మీ తండ్రి వంటి గొప్ప నాయకుడిని అవమానిస్తున్నాడని మీరు గ్రహించలేదు. మీరు అతనికి ఎంత ఎక్కువ అవకాశం ఇస్తే, మీరు రాజకీయంగా అంత కోల్పోతారు. మీ పార్టీ అసాంఘిక పోకిరీలకు సురక్షిత స్వర్గధామంగా మారుతోంది. ఇది చాలా అవమానకరం' అని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా కూడా వ్యవహరిస్తున్న ఖుష్బూ పేర్కొన్నారు. కాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై మాట్లాడుతూ... గతంలో గవర్నర్, ఇప్పుడు ఖుష్బూపై కృష్ణమూర్తి చేసిన వ్యాఖ్యలు అత్యంత ఖండనీయం, గర్హనీయమన్నారు. ఇతడిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణమూర్తి గతంలో తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో డీఎంకే నుంచి ఆయన్ను సస్పెండ్ చేశారు. అయితే క్షమాపణ చెప్పిన తర్వాత దానిని రద్దు చేయడం జరిగింది.

దిల్లీలో ఇద్దరు మహిళల కాల్చివేత

డబ్బు విషయంలో గొడవే కారణం: పోలీసులు, బీజేపీ

శాంతిభద్రతల నిర్వహణ లోపం వల్లే ... లెఫ్టినెంట్ గవర్నర్‌పై కేజ్రీవాల్ విమర్శలు

న్యూఢిల్లీ: డబ్బు విషయంలో జరిగిన గొడవ ఇద్దరు మహిళల ప్రాణాలు తీసింది. ఆర్థిక లావాదేవీలపై వివాదం క్రమంలో సాయుధులు ఆ ఇద్దరు మహిళలను కాల్చిచంపారని దిల్లీ పోలీసులు తెలిపారు. ఈ ఘటన దిల్లీ, ఆర్కేపురంలోని అంబేద్కర్ బస్తీలో ఆదివారం జరిగిందన్నారు. ముగ్గురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. స్థానికులు తీసిన వీడియో ప్రకారం గొడవ మధ్యలో కాల్పులు జరిగినట్లు తెలుస్తోంది. దుండగులు అక్కడ నుంచి పరారు కాగా మహిళ కింద పడిపోవడం, స్థానికులు కేకలు వేయడం వంటి దృశ్యాలు అందులో ఉన్నాయి. ఈ ఘటన దేశ రాజధానిలో రాజకీయ వివాదానికి తెరతీసింది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బాధితులను సానుభూతి తెలుపుతూ నగరంలో శాంతిభద్రతలపై ఆప్ ప్రభుత్వానికి అధికారం ఉండివుంటే దిల్లీ సురక్షితమైన ప్రాంతంగా ఉండేదన్నారు. 'ఇద్దరు మహిళల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాం. మృతులకు సంతాపం ప్రకటిస్తున్నాం. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాం. దిల్లీ ప్రజలు అభద్రతా భావానికి గురవుతున్నారు. అసురక్షితంగా ఉన్నట్లు భయపడుతున్నారు. దిల్లీలో శాంతి భద్రతల పరిస్థితిని చూసుకోవాల్సిన బాధ్యులు పరిస్థితిని చక్కబెట్టడం మానేసి దిల్లీ ప్రభుత్వంపై నియంత్రణ కోసం కుట్రలు పన్నడంలో నిమగ్నమయ్యారు' అని కేజ్రీవాల్ హిందీలో ట్వీట్ చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్‌పై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఆప్ నేతలు కూడా ఆయనతో ఏకీభవించారు. దిలీలో శాంతి భద్రతలపై, పోలీసు వ్యవస్థపై సర్వాధికారులు లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉన్న విషయం తెలిసింది. అయితే కేజ్రీవాల్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి స్పందిస్తూ వ్యక్తిగత శత్రుత్వం వల్ల ఈ ఘటన జరిగిందని అన్నారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఉదయం 4.40గంటలకు బాధితుల సోదరుడు లలిత్ నుంచి ఫోన్ వచ్చిందని, హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని ఇద్దరు మహిళలను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయిందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. మృతులను పింకీ (30), జ్యోతి (29)గా గుర్తించామన్నారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం దుండగులు లలిత్ కోసం వచ్చారని, డబ్బు విషయంలో వీరి మధ్య గొడవ జరిగిందని డీసీపీ మనోజ్ అన్నారు. ప్రధాన నిందితుడు, అతని ఇద్దరు సహచరులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని అరుణ్, మైఖెల్, దేవ్‌గా గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. మృతుల మరో సోదరుడు లాల్ మాట్లాడుతూ 'మా అన్న లలిత్ ఎవరికో రుణంగా కొంత రొక్కమిచ్చారు. తన డబ్బు తిరిగివ్వాలని ఆయన వారిని శనివారం కోరారు. దీంతో వాగ్వాదం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు మేమంతా నిద్రపోతున్నప్పుడు కొందరు మా ఇంటికి వచ్చి తలుపు బాదారు, బిగ్గరగా కేకలు వేశారు. భయపడి బంధువులను పిలిస్తే ఇదే వీధులో నివాసముండే ఇద్దరు సోదరీమణులు వచ్చారు. అప్పటికి వచ్చిన వాళ్లు వెళ్లిపోయారు. మళ్లీ కొద్దిసేపటికి పిస్తోళ్లతో తిరిగొచ్చారు. మా అన్నను లక్ష్యంగా చేసుకున్నారు. ఇద్దరు సోదరీమణులు ఆయనను కాపాడాలని ప్రయత్నించగా దుండగులు వారిద్దరిపై కాల్పులు జరిపారు. ఇద్దరు అక్కడికక్కడే కుప్పకూలిపోగా కాల్పులు జరిపిన వారు తప్పించుకుపోయారు' అని అన్నారు.

ఎండలకు నితీశ్ బేజారు



పాట్నా: బాబోయ్ ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు తట్టుకోలేక పోతున్నా అంటూ బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నిట్టూర్పు వదిలారు. రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి అనుగ్రహ నారాయణ్ సింగ్ జయంతి సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. ఎండ వేడిమికి బేజార య్యారు. చాలా రోజులుగా రాష్ట్రంలో 40డిగ్రీల కంటే ఎక్కువ గానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖులంతా చాలాసేపు ఎండలోనే ఉండాల్సి వచ్చింది. అనంతరం మీడియాతో మాట్లాడిన నితీశ్... చాలా వేడిగా ఉంది కదా అని అన్నారు. వ్యక్తిగత సహాయకుడు ఆయనకు గొడుగు పట్టగా ఉమ్మడి పౌరస్మృతికి బీజేపీ కసరత్తుపై విలేకరుల ప్రశ్నలకు 'వీటి గురించి తర్వాత మాట్లాడుకుందాం. ఈరోజు చాలా వేడిగా ఉంది' అని చెప్పి చిరునవ్వుతో జేడీయూ అధినేత అక్కడ నుంచి నిష్క్రమించారు.

ఏపీలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- అమర్నాథ్ కుటుంబీకులకు సీపీఐ నేతల పరామర్శ
- రౌడీమూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల: రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యంమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం ఉప్పాలవారి పాలెంలో రౌడీ మూకల చేతిలో దారుణహత్యకు గురైన అమర్నాథ్ కుటుంబ సభ్యులను ఆదివారం సీపీఐ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి, భద్రతలు పక్కాగా ఉన్నాయని ఒకవైపు డీజీపీ మరో వైపు ముఖ్యమంత్రి చెపుతున్నప్పటికి ఆ వాతావరణం ఎక్కడా కనిపించటం లేదన్నారు. ప్రశాంతతకు మారుపేరైన డెల్టా ప్రాంతంలో పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్‌ను అత్యంత కిరాతకంగా పెట్రోల్ పోసి తగలపెట్టడం అమానుష చర్య అన్నారు. పోలీసు వ్యవస్థ ఏ స్థాయిలో పనిచేస్తుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు అదుపు చేయటంలో పోలీస్ శాఖ పూర్తిగా విఫలమైందన్నారు. అరాచకాలకు,అన్యాయాలకు, దౌర్జన్యాలకు కేరాఫ్‌గా రాష్ట్రంలో జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఇంతటి దారుణమైన దుర్మార్గమైన సంఘటన ఎక్కడా జరగలేదన్నారు. అన్యం పుణ్యం ఎరుగని బాలుడిని తన అక్కను వేదించవద్దు అన్నందుకే పెట్రోల్ పోసి చంపివేయటం అంటే నీచమైన ఘోరమైన దుర్మార్గమైన ఘటన దశాబ్దకాలంలో ఎక్కడ జరగలేదన్నారు. అధికార మదంతో, కామంతో కళ్లు నెత్తికి ఎక్కి, దున్నపోతుల మాదిరి చెలరేగిన రౌడీమూక నీచమైన దారుణ ఘటనకు పాల్పడటం బాధాకరం అన్నారు. రాష్ట్రంలో హోంమంత్రి ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తన అక్కను ఏడిపిస్తున్న ఆకతాయిలను ప్రశ్నించిన బాలుడిని హత్య చేస్తే ఆ కుటుంబాన్ని హోంమంత్రి ఇంతవరకు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. విశాఖ నగరంలో రౌడీల కదలికలు లేవని, భూ కబ్జాలు, దందాలు, దౌర్జన్యాలు లేవని ప్రశాంతంగా ఉందని మీడియాతో చెపుతున్న డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి సిగ్గుపడాలని అన్నారు. అదేరోజు చెరకుపల్లిలో ఈ ఘటన జరగిందన్నారు. పోలీసులు అంటే భయం లేదు, చట్టాలను గౌరవించే పరిస్థితి లేదని, నైతికంగా పోలీస్ వ్యవస్థ పూర్తిగా తన ఉనికిని కోల్పోయిందని విమర్శించారు. అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ బాలుడి హత్య కేసును పక్క దారి పట్టించేందుకు ప్రయత్నం చేయటం దారుణం అన్నారు. నిందితులకు శిక్ష పడే వరకు, బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. ం ాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అధికార పార్టీ దుర్మార్గాలు, దౌర్జన్యాలపై ఈ నెల 22 వ తేదీన విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి నిందితులకు త్వరగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కూల్, కాలేజ్‌లకు విద్యార్థినిలు వెళుతున్న దారిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలన్నారు. దారుణ హత్యకు గురైన అమర్నాథ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ప్రభుత్వం ఉద్యోగం కల్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అమర్నాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య, జంగాల అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్, గీత పనివార సంఘం రాష్ట్ర నాయకులు కంచర్ల కాశయ్య, సీపీఐ నాయకులు కోట మాల్యాద్రి, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ముండ్ల జాన్, దోమ రాజారెడ్డి, గౌడ సంఘం నాయకులు పీటా సుబ్బరామయ్య, ఉప్పాల నాగేశ్వరరావు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఎస్కే షబ్బీర్ విద్యార్థి యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

చైనాను చూసి మోదీ నేర్చుకోవాల్సిన పాఠమిది..!!

న్యూఢిల్లీ: చైనా సుప్రీం పీపుల్స్ కోర్టు ఇటీవల జారీ చేసిన ఆదేశాలు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాఠంగా తీసుకునే విధంగా ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను మోదీ తీసుకోగలిగినట్లైతే దాదాపు 10 లక్షల కోట్ల మేరకు రుణ ఎగవేత దారులు, అక్రమ పన్ను మినహాయింపు లబ్ధిదారుల నుంచి ఎంతో కొంత వసూలు చేయవచ్చునని నారాయణ అభిప్రాయం వ్యక్తంచేశారు. చైనా సుప్రీం పీపుల్స్ కోర్టు ఇటీవల 67.3 లక్షల మంది బ్యాంకు రుణాల ఎగవేతదారుల్ని బ్లాక్ లిస్ట్ చేయమని ఆదేశించింది. బ్లాక్ లిస్టు ఎక్కడ..? ఎందులో..? ఎలా..? విమానాల్లో ప్రయాణాలు చేయలేని విధంగా, కొత్తగా రూపాయి రుణం పుట్టకుండా చివరకు క్రెడిట్ కార్డులు కూడా పనిచేయకుండా !

గ్లోబల్ టైమ్స్ కథనం ప్రకారం చైనా ప్రభుత్వం ఇప్పటికే 61.5 లక్షల మందిని విమానాల టికెట్లు కూడా కొనకుండా బ్లాక్ లిస్టు చేసింది. 22.2 లక్షల మంది అసలు హైస్పీడ్ ట్రెయిన్లలో ప్రయాణం కూడా చేయకుండా నిషేధించింది పాస్‌పోర్టులు, ఐడీ కార్డుల ఆధారంగా దీన్ని అమలు చేస్తున్నట్టు సుప్రీం పీపుల్స్ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో చీఫ్ మెంగ్ జియాంగ్ చెప్పారు. 71 వేల మంది ఎగవేతదారులు కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులుగా, ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేయకుండా ఆదేశాలు జారీ చేశారు. 5.5 లక్షల మంది రుణఎగవేతదారుల క్రెడిట్ కార్డుల దరఖాస్తులను చైనా పారిశ్రామిక, వాణిజ్య బ్యాంకు చెత్తబుట్టలో పారేసింది. ప్రభుత్వ సిబ్బంది, రాజకీయ సలహా కమిటీల సభ్యులు, స్థానిక లెజిస్టేటివ్ సభ్యులు, చైనా కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ డెలిగేట్స్ విషయంలోనూ ఎలాంటి మినహాయింపులు ఇవ్వవద్దని సుప్రీం ఆదేశించింది. దీంతో కొందరిని బహిష్కరించారు, కొందరిని డిమోట్ చేశారు. కనీసం పది లక్షల మంది దీంతో బెదిరిపోయి, రుణాలు చెల్లించటానికి సిద్ధపడుతున్నారట.

మణిపూర్‌పై కేంద్రం అలక్ష్యం

న్యూఢిల్లీ: సరిహద్దు రాష్ట్రం మణిపూర్ అల్లర్లతో అట్టుడుకుతుంటే ప్రధాని నరేంద్ర మోదీ తన మన్ కీ బాత్‌లో మణిపూర్ ప్రస్తావన తీసుకురావడం లేదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖడ్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఘర్షణలతో అనిశ్చితి, కల్లోల వాతావరణం నెలకొంటే మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సరిహద్దు రాష్ట్రాన్ని అలక్ష్యం చేస్తోందని విమర్శించారు. మణిపూర్‌ను సందర్శించేందుకు అఖిల పక్ష బృందాన్ని కేంద్రం అనుమతించాలని ఖడ్గే డిమాండ్ చేశారు. మణిపూర్‌లో పరిస్థితి ఆందోళనకరంగా మారినా ప్రధాని మోదీ మౌనం వీడడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో పరిస్థితిపై చర్చించేందుకు ఎలాంటి సమావేశం ఏర్పాటు చేయలేదని, అఖిల పార్టీ సమావేశానికీ మోదీ చొరవచూపలేదని దుయ్యబట్టారు. మీ ప్రభుత్వం మణిపూర్‌ను భారత్‌లో భాగంలా చూడటం లేదని అనిపిస్తోందని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. మితై ఇతర వర్గాల మధ్య అల్లర్లతో మణిపూర్ కొద్దిరోజులుగా అట్టుడుకుతుండగా తాజా అల్లర్లు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. మే 3న జరిగిన ర్యాలీ అనంతరం హింస ప్రజ్వరిల్లడంతో అనేక జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. ఇక మణిపూర్ మండుతుంటే మీ ప్రభుత్వం నిద్రలో జోగుతున్నదని ఖడ్గే ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు. మణిపూర్‌లో శాంతిని భగ్నం చేస్తున్న శక్తులపై చర్యలు చేపట్టి ప్రధాని రాజధర్మాన్ని అనుసరించాలని ఆయన కోరారు.

స్వలాభాపేక్షతో రెజ్లర్లను వాడుకోవాలనుకున్నారు

- బబితా ఫోగాట్, తీరథ్ రాణాపై సాక్షి మాలిక్ ఆరోపణలు
- ఆందోళనను ప్రోత్సహించలేదు నాకేం సంబంధంలేదు: బబిత

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్లు చేపట్టిన ఆందోళన నేపథ్య పరిణామాలు ప్రస్తుత, మాజీ రెజ్లర్ల మధ్య మాటల యుద్ధానికి తెరతీశాయి. తమ ఆందోళన రాజకీయ ప్రేరేపితం కాదని, కాంగ్రెస్‌తో సంబంధం లేదని రెజ్లర్లు చెబుతున్నప్పటికీ పార్టీల పేర్లు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా స్టార్ రెజ్లర్ సాక్షి మాలిక్, ఆమె భర్త సత్యవర్త్ కడిగన్ ఓ వీడియో ద్వారా తమ ఘోష వినిపించారు. తమ పోరాటానికి కాంగ్రెస్‌తో సంబంధం లేదన్నారు. తొలుత ఆందోళనకు అనుమతులు తెచ్చినది బీజేపీ నేతలు బబితా ఫోగాట్, తీరథ్ రాణా అని చెప్పారు. స్వలాభం కోసం రెజ్లర్లను వాడుకోవాలని మాజీ రెజ్లర్, బీజేపీ నేత బబితా ఫోగాట్ ప్రయత్నించారని సాక్షి మాలిక్ ఆదివారం చేసిన ట్వీట్ దుమారం రేపింది. తమ తరపున కాకుండా ప్రభుత్వ పక్షాన నిలిచారని, రెజ్లర్ల ఉద్యమాన్ని నీరుగార్చేలా వ్యవహరించారని ఆమె ట్విట్టర్‌లో ఆరోపించారు. 'మా వీడియోలో తీరథ్ రాణా, బబితా ఫోగాట్ ఏ విధంగా తమ స్వప్రయోజనాల కోసం రెజ్లర్లను వినియోగించుకోవాలని భావించారో చెప్పాం. రెజ్లర్లు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారిని వదిలేసి ప్రభుత్వ శరణకు వీరు చేరుకున్నారు' అని సాక్షి వ్యాఖ్యానించారు. ఈ పరిణామం సాక్షి మాలిక్, బబితా ఫోగాట్‌కు మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. నీవు కాంగ్రెస్ తోలుబొమ్మవంటూ మాలిక్‌పై బబితా ఫోగాట్ మండిపడ్డారు. 'నా చెల్లెలు, ఆమె భర్త పెట్టిన వీడియో చూసి నాకు బాధ కలిగింది. అదే సమయంలో నవ్వు కూడా తెప్పించింది. పోలీసుల అనుమతి కోరిన లేఖలో నా సంతకం లేదు. దాంతో నాకు ఎలాంటి సంబంధం లేదు' అన్న మాటలతో రెజ్లర్ల పోరాటంతో తనకు సంబంధం లేదని ఫోగాట్ తేల్చేశారు. 'మొదటి రోజు నుంచి ఎలాంటి ఆందోళన, ప్రదర్శనకు నేను అనుకూలంగా లేను. ప్రధానిపై న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. ఏదో ఒక రోజు నిజం బయటకు వస్తుందని విశ్వసించా. ప్రధానిని లేక హోంమంత్రిని కలిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని పదేపదే చెప్పాను కానీ మీకు పరిష్కారం దీపేందర్ హుడా, కాంగ్రెస్, ప్రియాంక గాంధీ వద్ద కనిపించింది. పార్లమెంటు భవనాన్ని ప్రారంభించే రోజు మార్చ్ నిర్వహించడం, పతకాలను గంగలో నిమజ్జనం చేయాలనుకోవడం ఎంతటి సిగ్గుచేటో మీ వీడియో ద్వారా ప్రజలు అర్థం చేసుకుంటారు. మీ ఏ విధంగా కాంగ్రెస్ చెప్పినట్లు ఆడుతున్నారో తెలుసుకుంటారు. ప్రజలు ప్రశ్నిస్తున్నారు కాబట్టి మీ వాస్తవ ఉద్దేశాలను బహిర్గతం చేసేందుకు ఇదే సమయం' అని బబితా ఫోగాట్ వ్యాఖ్యానించారు.

మీకు అండగానే ఉన్నాగా: తీరథ్

సాక్షి మాలిక్ ఆరోపణలను రాణా కూడా తోసిపుచ్చారు. 'రెజ్లర్లు ఆందోళన చేపట్టకముందు నా వద్దకు వచ్చారు. దోపిడీకి గురవుతున్నట్లు చెప్పారు. మా సోదరీమణులు, కుమార్తెలకు మద్దతిస్తామని చెప్పాం. న్యాయ పోరాటంతో నాది అథ్లెట్ల పక్షమే. ఇంతకుముందు, ఇప్పుడు కూడా వారితోనే ఉన్నా. రెజ్లర్లు దేశానికి గర్వకారణం. క్రీడాకారుల గౌరవ మర్యాదలకు బీజేపీ అధిక ప్రాధాన్యతనిస్తుంది. నాకూ వారంటే ఎంతో గౌరవం. అన్ని వేళలా క్రీడాకారులకు మద్దతుగా నిలుస్తా' అంటూ రాణా ఓ వీడియో విడుదల చేశారు. తమ పతకాలను గంగలో నిమజ్జనం చేసివుంటే తీవ్ర పరిణామాలు చోటుచేసుకునేవని, హింస జరిగివుండేదని సాక్షి మాలిక్, ఆమె భర్త సత్యవర్త్ కడియన్ చెప్పడంపై స్పందిస్తూ 'వాళ్ల పతకాలను గంగలో నిమజ్జనం చేస్తే హింస జరిగేదన్నట్లుగా ఎలాంటి చర్చ జరగలేదు. క్రీడాకారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది కాబట్టి వారు ఆ నిర్ణయం తీసుకున్నారు. అయితే దేశ మనోభావాలు అందుకు ఒప్పుకోలేదు' అని రాణా వెల్లడించారు. తొలుత ఓ వాట్సాప్ గ్రూపులో రాణా వీడియోను పెట్టారు. అయితే దానిని తర్వాత తొలగించారు.

2024లో యూపీఏ-3 సాధ్యమే

- బీజేపీపై పోరులో విపక్షాలకు ఇచ్చి-పుచ్చుకోవడం అవశ్యం
- పీటీఐతో ఇంటర్వ్యూలో ఎంపీ కపిల్ సిబల్

న్యూఢిల్లీ: 2024లో యూపీఏ-3 ప్రభుత్వం ఏర్పాటు కాగలదని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆకాంక్షించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు 'ఇచ్చి- పుచ్చుకోవడం' కోసం సిద్ధంగా ఉండాలని, అందుకు అనుగుణమైన అజెండాతో ముందుకెళితే అనుకున్నది సాధించవచ్చన్నారు. ఉమ్మడి కనీస కార్యక్రమానికి బదులు భారత్ కోసం కొత్త విజన్ గురించి ప్రతిపక్ష పార్టీలు చర్చించాలని సూచించారు. ఈనెల 23న పాట్నాలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షతన ప్రతిపక్ష పార్టీల సమావేశం జరగనున్న క్రమంలో సిబల్ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. న్యూయార్క్ నుంచి పీటీఐకి ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో వచ్చే ఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ రాణిస్తుందని సిబల్ విశ్వాసం వ్యక్తంచేశారు. కర్నాటకలో కాంగ్రెస్ అఖండ విజయాన్ని ప్రస్తావిస్తూ బీజేపీ అజేయ పార్టీ కాబోదని, 2024లో పోరు నరేంద్రమోదీపై కాదని ఆయన సిద్ధాంతాలపైనని తెలిపారు. ప్రతిపక్షాలు ఐక్యంగా ఉండి, సీట్ల సర్దుబాట్లు, టికెట్ల విషయంలో ఇచ్చి పుచ్చుకునే వైఖరిని అవలంభిస్తే 2024లో యూపీఏ-3 ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని చెప్పారు. టికెట్లు, సీట్ల సర్దుబాట్లపై అవగాహన కదిరితే ఇది తప్పక జరుగుతుందని, ప్రతిపక్షంలో విభేదాలను భూతద్దంలో చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని అని ఉమ్మడి అభ్యర్థులను నిలబెట్టడం సాధ్యమా అన్న ప్రశ్నకు సిబల్ బదులిచ్చారు. రాష్ట్రాల్లో కొన్ని పార్టీలు చాలా బలంగా ఉన్నాయని చెప్పారు. రాజస్థాన్, ఉత్తరాఖండ్, హరియాణ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీకి ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఉందని, ఆ రాష్ట్రాల్లో ఎలాంటి సమస్యలు రావని, కాంగ్రెస్‌యేతర ప్రతిపక్ష ప్రభుత్వాలు ఉన్న పశ్చిమ బెంగాల్, తమిళనాడులో టీఎంసీ, డీఎంకే పార్టీలకు మంచి పట్టు ఉందని చెప్పారు. పశ్చిమ బెంగాల్ కొన్ని నియోజకవర్గాల్లో వివాదాలు తలెత్తవచ్చుగానీ తమిళనాడులో అలాంటి పరిస్థితి ఉండదని, చాలాసార్లు డీఎంకే, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయని సిబల్ తెలిపారు. అదే విధంగా తెలుగు రాష్ట్రాల గురించి మాట్లాడుతూ తెలంగాణలో సమస్య రావచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష సంకీర్ణానికి అవకాశం లేదని చెప్పారు. ఏపీలో వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీ (టీడీపీ) మధ్య త్రిముఖ పోరు ఉంటుందని అన్నారు. గోవాలో బీజేపీతో నేరుగా కాంగ్రెస్ తలపడుతుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంటే విపక్ష కూటమిలో రాష్ట్రీయ లోక్‌దళ్, కాంగ్రెస్ పార్టీలు చిరుభాగంగా ఉంటాయన్నారు. బీఎస్పీ అన్ని చోట్ల నుంచి పోటీ చేయనున్నట్లు మాయావతి ప్రకటించారు కాబట్టి ఆ పార్టీతో పొత్తు ఉండబోదన్నారు. బీహార్‌లో కాంగ్రెస్‌కు పట్టు లేదని, అక్కడ కూటమిలో సమస్య రాదని సిబల్ అన్నారు.

ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్

భారత్ జోడీకి బంగారు పతకం

న్యూఢిల్లీ: ఇండోనేసియా ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత పురుషుల జోడీ చరిత్ర సృష్టించింది. మెన్స్ డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడి ఘన విజయం సాధించి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచ చాంపియన్స్ అయిన మలేషియాకు చెందిన ఆరోన్ చియా-సో వుయ్ జోడీని భారత జోడీ 21-17, 21-18 తేడాతో చిత్తు చేసింది. ఇండోనేసియా బ్యాడ్మింటన్ ఓపెన్‌లో ఏ డబుల్స్ విభాగంలోనైనా భారత్ బంగారు పతకాన్ని గెలుచుకోవడం ఇదే తొలిసారి. గత కొంత కాలంగా బీడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తున్న సాత్విక్ జోడీ... శనివారం జరిగిన సెమీస్ తొలి గేమ్‌లో పరాజయం పాలైనా తర్వాత పుంజుకుని విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఫైనల్‌లోనూ నెగ్గి భారత్‌కు బంగారు పతకం సాధించిపెట్టారు. ఒకప్పుడు భారత బ్యాడ్మింటన్ అంటే... సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ ఇలా ఇద్దరు ముగ్గురు షట్లర్ల పేర్లే ఎక్కువ చర్చకు వచ్చేవి. కానీ ఇప్పుడు డబుల్స్‌లోనూ మనవాళ్లు దుమ్మురేపుతున్నారు. సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అంతర్జాతీయ సర్క్యూట్‌లో నిలకడైన విజయాలతో డబుల్స్‌లోనూ పతకాలు కొల్లగొట్టగలమనే భరోసా ఇస్తున్నారు. నిరుడు బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం నెగ్గిన ఈ జోడీ... ఇప్పుడు ఇండోనేసియా ఓపెన్ టైటిల్‌ను కూడా తన ఖాతాలో వేసుకుంది.

విరాట్ ఆస్తుల విలువ వెయ్యికోట్ల పైనే

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆస్తుల విలువ రూ.వెయ్యి కోట్లు దాటింది. ప్రస్తుతం విరాట్ కోహ్లీ స్థిర, చర ఆస్తుల విలువ మొత్తం కలిపి రూ.1050 కోట్లకు చేరిందని తాజాగా ఓ నివేదిక స్పష్టం చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్లలో మరే క్రికెటర్ ఆస్తులు రూ.వెయ్యి కోట్లు దాటలేదని ఆ నివేదిక పేర్కొంది. భారత్‌లోనే గాక ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది క్రికెటర్లు విరాట్ కోహ్లీకి వీరాభిమానులుగా ఉన్నారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా పెద్దపెద్ద వ్యాపార సంస్థలు కోహ్లీతో యాడ్స్ ద్వారా తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు పోటీపడుతున్నాయి. ప్రస్తుతం 18 కంపెనీల నుంచి కోహ్లీకి యాడ్స్ రూపంలో ఆదాయం సమకూరుతోంది. అదేవిధంగా కోహ్లీ స్టార్టప్ కంపెనీల్లో కూడా తన సంపదను పెట్టుబడిగా పెడుతున్నాడు. ప్రస్తుతం 8 స్టార్టప్స్‌లో కోహ్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉన్నాయి. అదేవిధంగా సోషల్ మీడియాలో కూడా కోహ్లీ భారీగా ఆదాయం సమకూరుతున్నది. కోహ్లీ తాను ట్విటర్‌లో చేసే ఒక్కో పోస్టుకు రూ.2.5 కోట్లు, ఇన్‌స్టాగ్రామ్‌లో చేసే ఒక్కో పోస్టుకు రూ.8.9 కోట్ల చొప్పున వసూలు చేస్తున్నాడు. మరో పక్క కోహ్లీకి బీసీసీఐ నుంచి రూ.7కోట్ల వార్షిక వేతనం, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ రూ.15 కోట్ల వేతనం చెల్లిస్తుంది. వీటికి అదనంగా ప్రతి మ్యాచ్‌కు మ్యాచ్ ఫీజు కూడా ఉంటుంది.

కొరియోగ్రాఫర్ రాకేష్ మాస్టర్ మృతి



హైదరాబాద్: ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ రాకేష్ మాస్టర్ (53) మృతి చెందారు. రాకేష్ మాస్టర్ వారం రోజుల క్రితం వైజాగ్ ఔట్ డోర్ షూటింగ్ నుండి హైదరాబాద్‌కు తిరిగి రాగా.. అప్పటి నుండి అనారోగ్యంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నట్టు సమాచారం. అయితే ఆదివారం ఉదయం ఇంట్లో రక్త విరోచనాలు చేసుకున్న రాకేష్ మాస్టర్‌ను కుటుంబసభ్యులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స కొనసాగిస్తుండగా... రాకేష్ మాస్టర్ తుదిశ్వాస విడిచారు. డ్యాన్సర్‌గా తన కెరీర్‌ను మొదలుపెట్టిన రాకేష్ మాస్టర్... సుమారు 1500 సినిమాలకు పనిచేశారు. రాకేష్ మాస్టర్ వివాదాస్పద వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో ఏదో ఒక వీడియోతో హాట్ టాపిక్‌గా నిలుస్తుండేవాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. రాకేష్ మాస్టర్ మృతిపై సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అభిమానులు దేవుడిని ప్రార్థిస్తున్నారు.

ఐర్లాండ్ టూర్‌కు బుమ్రా సిద్ధం?

న్యూఢిల్లీ: భారత జట్టు అభిమానులకు శుభవార్త. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులో చేరనున్నాడు. ఈమధ్యే న్యూజిలాండ్‌లో సర్జరీ చేయించుకున్న బుమ్రా... ఆగస్టులో జరిగే ఐర్లాండ్ టూర్ కల్లా ఫిట్‌నెస్ సాధించనున్నాడని సమాచారం. 'కోర్సు ప్రకారం అన్నీ సవ్యంగా జరిగితే బుమ్రా పూర్తి ఫిట్‌నెస్‌తో మైదానంలోకి దిగుతాడు. ఐర్లాండ్ సిరీస్‌కు అతను అందుబాటులో ఉండనున్నాడు' అని బీసీసీఐలోని ఒక అధికారి తెలిపాడు. భారత జట్టు ఆగస్టులో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఇరుజట్లు మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నాయి. ఆగస్టు 18, 20, 23వ తేదీన ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. సర్జరీ తర్వాత కోలుకుంటున్న బుమ్రా నెల క్రిత తన రన్నింగ్ షూ ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన విషయం తెలిసిందే. 'హలో నేస్తమా..! మనం మళ్లీ కలుస్తాం'అని క్యాప్షన్ రాసిన ఈ పేసర్ తన రీ-ఎంట్రీ గురించి సంకేతాలు పంపాడు. స్వదేశంలో ఈ ఏడాది జరిగే వన్డే వరల్డ్‌కప్‌లో బుమ్రా కీలకం కానున్నాడు. ఆలోపు అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించాలని భారత క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.